https://epaper.dksaardyamlochaatimpu.com




E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

# డీకే సార్థ్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక

హైదరాబాద్ | సంపుటి : 17 సంచిక : 314 | ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ | గురువారం, సెప్టెంబర్,17, 2026 | పేజీలు : 8 వెల : రూ.1/-

### ఫ్యూచర్ సిటీలో పెట్టుబడులు

# పెట్టేలా ప్రోత్సహించండి

### సింగపూర్ ప్రతినిధి బృందాన్ని కోరిన మంత్రి శ్రీధర్‌బాబు



**హైదరాబాద్,సెప్టెంబర్,16:** భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో పెట్టుబడులు పెట్టేలా సింగపూర్ కంపెనీలను ప్రోత్సహించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆ దేశ ప్రతినిధుల బృందాన్ని కోరారు. సెమీకండక్టర్ రంగంలో సింగపూర్‌కు ఉన్న సాంకేతిక, పారిశ్రామిక అనుభవాన్ని తెలంగాణతో అనుసంధానించి.. రాష్ట్రంలో ఫ్యాబ్ పరిశ్రమలతో పాటు అనుబంధ పరిశ్రమలు, సరఫరా వ్యవస్థను అభివృద్ధి చేసేలా సింగపూర్ కంపెనీల భాగస్వామ్యాన్ని మరింత పెంచేందుకు చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన ఎనర్జీ అండ్ ట్రేడ్ శాశ్వత కార్యదర్శి ఆగస్టిన్ లీ నేతృత్వంలోని ఆ దేశ ఉన్నతస్థాయి ప్రతినిధుల బృందం బుధవారం డా. బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో మంత్రి శ్రీధర్‌బాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు... అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా తెలంగాణను 'గ్లోబల్ ఇన్వెస్ట్ మెంట్ హబ్'గా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను వివరించారు. హై వాల్యూ ఇండస్ట్రీస్, ఆర్ అండ్ డీ, టెక్నాలజీ ఆధారిత పరిశ్రమలకు అవసరమైన ఎకోసిస్టమ్‌ను రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. ఐటీ/ఐటీఈఎస్, ఎమర్జింగ్ టెక్నాలజీస్, సెమీకండక్టర్లు, ఎలక్ట్రానిక్స్, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, లైఫ్‌సైన్సెస్, బయోటెక్నాలజీ,ఏరోస్పేస్, గ్రీన్ టెక్నాలజీ, రెన్యూవబుల్ ఎనర్జీ, లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఆర్ అండ్ డీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఇన్నోవేషన్ తదితర రంగాల్లో తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సింగపూర్ కంపెనీలకు విస్తృత అవకాశాలున్నాయన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో ఉన్న అనుకూలతలు, అవకాశా లపై అవగా హన కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 7,8,9తేదీల్లో నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్--2026'లో సింగపూర్ ప్రభుత్వం, ప్రముఖ కంపెనీల ప్రతినిధులు పాల్గొనేలా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సీనియర్ డైరెక్టర్ డా.ఫ్రాన్సిస్ చోంగ్, ఇండియా డైరెక్టరేట్ డైరెక్టర్ జీన్ యీ, సౌత్ ఏషియా ఎంటర్‌ప్రైజ్ డైరెక్టర్ ఆడ్రీ టూన్ తదితరులు పాల్గొన్నారు.

## క్షుద్రపూజల అంశం చర్చకు వస్తుందనే

# బీఆర్‌ఎస్ వికృత చేష్టలు

### అసెంబ్లీలో సీఎం రేవంత్ ఫైర్



**హైదరాబాద్,సెప్టెంబర్,16:** 22ఏ అంశంలో కొందరు ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని, మా బాధ్యతను ఇంకెవరో గుర్తుచేయాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఇది ప్రజల ప్రభుత్వం అని అసెంబ్లీ కంటే ముందే 22ఏ సమస్యపై ఫోకస్ పెట్టామన్నారు. ఇవాళ శాసనసభలో మాట్లాడిన సీఎం... మాపై వచ్చిన ఆరోపణల కారణంగా 22ఏ అశంపై చర్చ చేపట్టామన్నారు. ప్రధాన సమస్యలపై చర్చ నుంచి తప్పించుకునేందుకు విపక్షం ప్రయత్నించిందన్నారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడంతోనే బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి సస్పెండ్ అయ్యారన్నారన్నారు. గత బీఆర్ఎస్ హాయంలోని తప్పిదాలపై సభలో చర్చ జరుగుతుందని, కొందరు ఇతర రాష్ట్రాలకు వెళ్లి క్షుద్రపూజల అంశం చర్చకు వస్తుందనీ బీఆర్ఎస్?కు తెలుసని అందుకే ఎట్టి పరిస్థితుల్లో సభలో ఉండకూడదని వికృత చేష్టలు ప్రదర్శించారని సీఎం అన్నారు. గత ప్రభుత్వ తప్పిదాలపై చర్చ జరగకూడదనేదే బీఆర్ఎస్ విధానం అని అసెంబ్లీ నిర్వహణపై గత ప్రభుత్వ రూల్స్ నే మేమూ పాటించామన్నారు. నినాదాలతో కూడిన డ్రస్సులు, ప్లకార్డులతో అసెంబ్లీకి రావొద్దని గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే రూల్స్ పెట్టారన్నారు. స్పీకర్ ఆదేశాల మేరకే గేట్ నంబర్ 3 వద్ద అధికారులు అడ్డుకున్నారని అన్నారు. పార్లమెంట్ లో ఇలాంటి రూల్ ఉన్నా అక్కడ రాహుల్ ను అడ్డుకునేవారన్నారు. గత ప్రభుత్వం పెట్టిన అసెంబ్లీ రూల్స్ ను బీఆర్ఎస్ బ్రేక్ చేసిందని సభ బయట పోలీసులపై దాడి చేయడంతో పాటు సభాధ్యక్షుడిని అసభ్యకరంగా మాట్లాడారన్నారు. బీఆర్ఎస్ సభ్యులు విచక్షణ కోల్పోయి అహంకారాన్ని ప్రదర్శించారు.

## ఆ భూమిని హరీశ్‌రావు కుటుంబం

# ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటుంది?

### – మంత్రి పొంగులేటి



హైదరాబాద్, సెప్టెంబర్ 16 : మాజీ మంత్రి హరీశ్‌రావుపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిషాకింగ్ కామెంట్స్ చేశారు. హరీశ్‌రావు భూ దోపిడీకి పాల్పడ్డారని ఆరోపించారు. భూదాన్ భూమిని ఆయన కుటుంబం ఎలా రిజిస్ట్రేషన్ చేసుకుంటుంది? అని ప్రశ్నించారు. అసెంబ్లీలో మీడియాతో మంత్రి పొంగులేటి బుధవారం చిట్‌చాట్ చేశారు. ప్రభుత్వ భూమిని ఏ ప్రభుత్వ హయాంలో రిజిస్ట్రేషన్ చేసినా తప్పేనని మంత్రి చెప్పుకొచ్చారు. హరీశ్‌రావు బుద్ధి ఎక్కడ పోయింది? అని నిలదీశారు. 22ఏ కింద నాలుగు లక్షల ఎకరాల భూమి మాత్రమే ఉందని.. మిగతాదంతా ప్రభుత్వ భూమేనని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇంకా 40 వేల ఎకరాల భూమిని 22ఏ నుంచి తగ్గించామని స్పష్టం చేశారు. 22ఏ భూముల విషయంలో కీలక నిర్ణయాలు ఉంటాయని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ఈరోజు (బుధవారం) ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ కార్యాలయాల గురించి సభలో చర్చ జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి పొంగులేటి సమాధానం ఇచ్చారు. చాలా చోట్ల తహసీల్దార్ కార్యాలయాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయని ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.640 కోట్లతో కొత్త ఎమ్మార్వో భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మంత్రి వెల్లడించారు. ఇప్పటికే తహసీల్దార్ కార్యాలయాలను నిర్మించడం కోసం టెండర్లు పిలిచామని చెప్పుకొచ్చారు. అవసరమైన ప్రాంతాల్లో ఎమ్మార్వో, ఆర్డీవో కార్యాలయాలను నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఆదిలాబాద్‌లో నిర్మాణంలోని కార్యాలయాన్ని త్వరగా నిర్మించి ప్రారంభిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

# ఎల్బీనగర్‌లో118 జీఓ సమస్యను పరిష్కరిస్తాం..

### అసెంబ్లీ వేదికగా సీఎం హామీ



హైదరాబాద్, సెప్టెంబర్ 16: ఎల్బీనగర్ నియోజకవర్గంలోని ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుభవార్త చెప్పారు. బుధవారం శాసనసభలో మాట్లాడుతూ.. ఎల్బీనగర్ నియోజకవర్గంలో కొంతమంది ప్రజలు ప్రభుత్వ భూముల్లో ఇళ్లు నిర్మించుకుని.. ఏళ్ల తరబడి అక్కడే నివసిస్తున్నారని అన్నారు. వీరి సమస్యకు త్వరలోనే పరిష్కారం చూపుతామని.. ప్రభుత్వ తరఫున శుభవార్త చెప్పనున్నట్లు తెలిపారు. ఈ నియోజకవర్గంలో118 జీఓ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రభుత్వ భూముల్లో లేఅవుట్లు, నిర్మాణాలను క్రమబద్ధీకరిస్తామన్నారు. సికింద్రాబాద్ పరిధిలో ఫ్రీహోల్డ్, భూదాన్ భూ సమస్యను పరిష్కరిస్తామని రేవంత్ పేర్కొన్నారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని.. 22ఎ సమస్యల్లో 12 అంశాలను గుర్తించామని ముఖ్యమంత్రి తెలిపారు. 12 ప్రధాన సమస్యల పరిష్కారానికి హైపవర్ కమిటీని నియమిస్తామని ప్రకటించారు. 22ఎలో ఏ భూములను చేర్చాలనేదానిపై నిర్దేశిత విధానంతో ముందుకెళ్తామన్నారు. టోల్‌ఫ్రీ నెంబర్ పెట్టి సమస్య పరిష్కారానికి అడుగులు వేశామని చెప్పారు. సీఎం ఇల్లు 22ాలో ఉందని వాళ్లే అంటున్నారని.. అది మంత్రి చేతుల్లో ఉండదని.. టెక్నికల్ సమస్య అని తెలుసుకోవాలన్నారు. 22ాలో ఏదైనా భూమిని చేర్చే అధికారం.. 22ఎ లేదా సబ్‌కలెక్టర్లదే అని పేర్కొన్నారు. భూ సర్వే నంబర్, పట్టాదార్ వివరాలను స్పష్టంగా గుర్తిస్తారని తెలిపారు. భూముల విషయంలో త్వరలోనే నూతన విధానాన్ని తీసుకొస్తామని రేవంత్ తెలిపారు. నిషేధిత జాబితాలో పెట్టేముందు సహా ఈ–మెయిల్, పత్రికా ప్రకటన విధానాన్ని అనుసరిస్తామన్నారు. అభ్యంతరాలు తెలిపేందుకు 15 రోజుల సమయం ఇస్తామని.. మొత్తం అనుసరించిన విధానాన్ని రికార్డు చేస్తామని చెప్పారు. దేవాదాయ, వక్ఫ్ భూముల చట్టం ప్రకారం కొనుగోలు చేస్తే వాటిని నిషేధిత జాబితా నుంచి తొలగిస్తామని ప్రకటించారు. అధీకృత లేఅవుట్లలోని భూముల పెండింగ్ రిజిస్ట్రేషన్లను వారంలో పరిష్కరిస్తామన్నారు. ఎవీణూా, ఖుజూ అనుమతులు పొందిన లేఅవుట్ రిజిస్ట్రేషన్లు చేస్తామని అన్నారు. సింగరేణి పరిధిలో అర్హత ప్రమాణాలకు అనుగుణంగా పట్టాలు ఇస్తామని చెప్పారు.

## మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానం..


# నేడు వారణాసికి సీఎం చంద్రబాబు



**అమరావతి,సెప్టెంబర్,16:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం వారణాసిలో పర్యటించనున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ 25 ఏళ్ల ప్రజా సేవా ప్రస్థానాన్ని పురస్కరించుకుని కాశీలో నిర్వహిస్తున్న 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో ఆయన పాల్గొంటారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా మోదీ అందించిన సేవలకు గుర్తుగా దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ప్రధాని రాజకీయ జీవితంతో ముడిపడిన వారణాసి, ఆయన స్వస్థలం వాద్‌నగర్‌ను కలుపుతూ 'వారణాసి--వాద్‌నగర్ సేవా యాత్ర'ను చేపట్టారు. యువత, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థల భాగస్వామ్యంతో జరిగే ఈ కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొని సేవా యాత్రను ఫ్లాగ్ ఆఫ్ చేస్తారు. దేశాభివృద్ధిలో ప్రజా భాగస్వామ్యం, సేవా భావం, సామాజిక బాధ్యత వంటి అంశాల ప్రాముఖ్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశం. ఈ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం ఉదయం 7:30 గంటలకు విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో బయలుదేరి 9:35 గంటలకు వారణాసి చేరుకుంటారు. ఉదయం 11:15 గంటలకు శ్రీ కాశీ విశ్వనాథుని దర్శించుకుంటారు. అనంతరం రుద్రాక్ష్ అంతర్జాతీయ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే సేవా యాత్ర ఫ్లాగ్ ఆఫ్ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమం ముగిసిన తర్వాత మధ్యాహ్నం 3:10 గంటలకు వారణాసి నుంచి తిరుగుపయనమై సాయంత్రం 5:15 గంటలకు అమరావతికి చేరుకుంటారు.

## మక్కా సమీపంలో డ్రోన్ కలకలం..

# కూల్చివేసిన సౌదీ బలగాలు..!



పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు సౌదీ అరేబియాలోని ముస్లింల పవిత్ర నగరం 'మక్కా' సమీపానికీ చేరాయి. మక్కా నగరానికి సమీపంలోని నిషేధిత గగనతలంలోకి ఓ డ్రోన్ ప్రవేశించేందుకు ప్రయత్నించగా.. సౌదీ అరేబియా రాయల్ ఎయిర్ డిఫెన్స్ బలగాలు దానిని అడ్డుకుని కూల్చివేసినట్లు సౌదీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో మక్కా, జెడ్డా, తైఫ్ నగరాల్లో భద్రతా అప్రమత్తతను పెంచారు. సౌదీ నేతృత్వంలోని కూటమి ప్రతినిధి తుర్కి అల్–మాలికి వెల్లడించిన వివరాల ప్రకారం.. మక్కా సమీపంలోని నిషేధిత గగనతలంలోకి డ్రోన్ ప్రవేశించేందుకు ప్రయత్నించింది. అయితే సౌదీ వైమానిక రక్షణ వ్యవస్థ దానిని గుర్తించి, నగరానికి చేరకముందే అడ్డుకుని నిర్వీర్యం చేసింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరిగినట్లు సమాచారం లేదు. ఈ డ్రోన్‌ను యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు ప్రయోగించినట్లు సౌదీ అరేబియా ఆరోపించింది. మక్కా, ఇతర పవిత్ర స్థలాల భద్రత తమకు 'రెడ్ లైన్' అని సౌదీ అధికారులు హెచ్చరించారు. అయితే ఈ ఆరోపణలను హూతీలు ఖండించారు. మక్కా నగరంతో పాటు ఇతర ఇస్లామిక్ పవిత్ర స్థలాలకు తమ నుంచి ఎలాంటి ముప్పు లేదని హూతీ వర్గాలు స్పష్టం చేశాయి. మక్కా, దాని పరిసర ప్రాంతాల్లో ఇలాంటి భద్రతా అలర్ట్ జారీ చేయడం 2017 తర్వాత ఇదే తొలిసారిగా అధికారులు పేర్కొన్నారు. హూతీలు గతంలో మక్కాను లక్ష్యంగా చేసుకునేందుకు ప్రయత్నించిన ఘటనలు చోటుచేసుకున్నాయి. తాజా పరిణామంతో మక్కాతో పాటు జెడ్డా, తైఫ్ నగరాల్లోనూ అధికారులు అప్రమత్తమయ్యారు. మక్కా నగరంలో ఇస్లాం మతంలో అత్యంత పవిత్రమైన కాబా ఉంది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ముస్లింలు రోజువారీ ప్రార్థనల సమయంలో కాబా వైపు తిరిగి నమాజ్ చేస్తారు. ప్రతి ఏడాది హజ్, ఉమ్రా కోసం భారీ సంఖ్యలో ముస్లింలు మక్కాను సందర్శిస్తారు. దీంతో నగర భద్రతకు సౌదీ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. యెమెన్‌లో హూతీ తిరుగుబాటుదారులతో సౌదీ అరేబియాకు చాలాకాలంగా ఘర్షణలు కొనసాగుతున్నాయి.

## గాలిలో ఊడిపోయిన టైరు..

# బోయింగ్ విమానానికి త్రుటిలో తప్పిన ప్రమాదం



ఇరాన్‌లో బోయింగ్ విమానానికి పెను ప్రమాదం తప్పింది. టేకాఫ్ అయిన తరవాత గాలిలో విమానం టైరు ఊడిపోయింది. మరోవైపు ఇంజిన్‌లోనూ లోపం తలెత్తింది. దీంతో బోయింగ్ 737 విమానం ఒక్కసారిగా భారీ కుదుపులకు గురైంది. ప్రయాణికులు అంతా ఆందోళన చెందారు. భయంతో కేకలు వేస్తూ ఇక ప్రాణాలు గాలిలో కలిసిపోతాయని భావించారు. అయితే వెంటనే అప్రమత్తమైన పైలట్లు విమానాన్ని మషద్‌కు మళ్లించి అత్యవసర ల్యాండింగ్ చేశారు.

విమానం కుదుపులతో బ్యాగులు కిందపడిపోవడంతో కొందరికి ఈ ప్రమాదంలో స్వల్పగాయాలు అయ్యాయి. ల్యాండింగ్ తరవాత వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పైలట్ల అప్రమత్తతోనే ప్రయాణికులు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. దీంతో చూసిన నెటిజన్లు సైతం బయపడిపోతున్నారు.

## వినాయక చవితి ఉత్సవాల్లో అప్రమత్తంగా ఉండాలి: సీపీ



మంచిర్యాల్(డీకే చాటింపు): వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధిలోని మంచిర్యాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన పలు గణేష్ మండపాలను సీపీ స్వయంగా సందర్శించి,ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపాల నిర్వాహకులతో మాట్లాడి ఉత్సవాలను పోలీసుల అనుమతులు, నిబంధనలకు లోబడి నిర్వహించుకోవాలని సూచించారు. ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదని, మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు, వైరింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండపాల వద్ద నిర్వాహకులు 24 గంటలూ అందుబాటులో ఉండాలని,భద్రత కోసం తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ పెట్రోల్ కార్లు,బ్లూకోట్స్ సిబ్బందితో 24 గంటలూ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నట్లు సీపీ తెలిపారు.ప్రతిరోజూ పోలీసు అధికారులు గణేష్ మండపాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లు,భక్తులకు అందుతున్న సౌకర్యాలు,ఇతర పరిస్థితులను పరిశీలిస్తున్నారని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని సీపీ తెలిపారు. మండపాల నిర్వాహకులు కూడా పోలీసుల సూచనలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. నిమజ్జనం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి, పోలీసుల సూచనలను పాటిస్తే గణేష్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో విజయవంతంగా నిర్వహించుకోవచ్చని సీపీ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. మండపాల వద్ద ఏవైనా అనుకోని సంఘటనలు లేదా అనుమానాస్పద పరిస్థితులు గుర్తించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీపీ సూచించారు. సీపీ వెంట మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,ఏసీపీ ఆర్.ప్రకాష్, ఇన్స్పెక్టర్ ప్రమోద్ రావు తదితర పోలీసు అధికారులు ఉన్నారు.

## ఇనుప మేకును మింగిన మహిళ....
## చాకచక్యంగా తొలగించిన వైద్యులు డాక్టర్ నవీన్ ఆడెపు....





బెల్లంపల్లి (డీకే చాటింపు )కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం గుండాయి పేటకు చెందిన మహిళ రాత్రి భోజనం చేస్తుండగా అనుకోకుండా ఒక ఇనుప మేకు ను మింగడం జరిగింది ఆ ఇనుప మేకు గొంతులో అడ్డు పడడంతో ఆ వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో,వెంటనే కుటుంబ సభ్యులు మంచిర్యాల లోని కాకతీయ గ్యాస్ట్రో అండ్ లివర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ నవీన్ ఆడెపు ను సంప్రదించడం జరిగింది డాక్టర్ నవీన్ వైద్య పరీక్షలు నిర్వహించి ఆ మహిళ గొంతులో ఇరుక్కున్న ఇనుప మేకును అత్యంత చాకచక్యంగా తొలగించడం జరిగింది దీంతో వారి కుటుంబ సభ్యులు ఊపిరి పీల్చు కున్నారు వారి కుటుంబ సభ్యులు డాక్టర్ నవీన్ కృతజ్ఞతలు తెలిపారు

## గణేష్ నవరాత్రుల సందర్భంగా అన్నదానం కార్యక్రమం....
## జనహిత అన్నపూర్ణ 436 వ సారి అన్న దాన కార్యక్రమం..




బెల్లంపల్లి (డీకే చాటింపు ) బుధవారం జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో జనహిత అన్నపూర్ణ అన్న దాన కార్యక్రమం 436 వ సారి బెల్లంపల్లి పట్టణం కాంట చౌరస్తా పల్లెటూరి బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ మాట్లాడుతూ గణేష్ నవరాత్రుల సందర్భంగా జనహిత అన్నపూర్ణ శాశ్వత అన్నదాతలు నిరుపేదలు, చిరువ్యాపారులు, బాటసారులకి ఒక పూట ఆకలి తీర్చేందుకు అన్న దాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమం లో సుమారు 180 మందికి ఒక పూట భోజనం అందించడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో జనహిత సేవా సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కాంపెల్లి విజయ్ కుమార్, కోశాధికారి కొడిపెల్లి గిరిప్రసాద్,ఉపాధ్యక్షుడు కందుల రాజన్న, సహాయ కార్యదర్శులు పెద్ది వినయ్ కుమార్, పనాస వెంకటేష్ కార్యవర్గ సభ్యులు డోలి సుకుమార్, భీముని కనకయ్య గౌడ్, నిచ్చకోల గురుస్వామి, చిలుముల సాయి కృష్ణ, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఏపీలో ఉపాధి పోరు..!



విజయవాడ: ఒకరిది ఉనికి కోసం పోరాటం. మరొకరిది ఆధిప త్యం కోసం ఆరాటం. పేదల కోసం తాము ఎంతో ఆలోచించి తెచ్చిన పథకం రూపురేఖలు మార్చారని కాంగ్రెస్..అప్పటి కంటే ఇంకా గొప్పగా తీర్చిదిద్దామని బీజేపీ ఎవరి వాదన వారిది. ఈ నేపథ్యంలో ఏపీలో ఇంట్రెస్టింగ్‌గా పొలిటికల్ సీన్ కనిపిస్తోంది. ఆఫ్టర్ ఏ లాంగ్ నవ్యాంధ్ర సెంట్రిక్‌గా..జాతీయ పార్టీలైనా.. కాంగ్రెస్, బీజేపీ ఎత్తుకు పైఎత్తు పాలిటిక్స్‌కు తెరలేపాయి.విభజన తర్వాత ఏపీలో డిపాజిట్లు కూడా దక్కించుకోలేని పరిస్థితిల్లో..వెంటిలేటర్ మీద కొనసాగుతోన్న హస్తం పార్టీ..అదును చూసి కమలం పార్టీని కార్నర్ చేసే స్కెచ్ వేస్తోంది. సరిగ్గా ఇదే టైమ్‌లో ఉపాధి హామీ పథకంలో మార్పులు తెస్తూ మోదీ సర్కార్ తీసుకున్న నిర్ణయం కాంగ్రెస్‌కు అతిపెద్ద అస్త్రంగా మారింది. ఓవైపు పార్లమెంట్‌లో..దేశవ్యాప్తంగా ఎన్డీయే సర్కార్ తీరుకు నిరసనగా విమర్శల దాడి చేస్తూనే ఉంది హస్తం పార్టీ.సేమ్‌టైమ్ గతంలో ఏపీ వేదికగా పురుడు పోసుకున్న ఉపాధి స్కీమ్‌లో..ఇప్పుడు కేంద్రం తెచ్చిన మార్పులను వ్యతిరేకిస్తూ.. రాయలసీమ సెంట్రిక్‌గా అతిపెద్ద ప్రొటెస్ట్‌కు వ్యూహాలు రచిస్తోంది. దీంతో కాంగ్రెస్ స్కెచ్‌కు చెక్ పెట్టేందుకు..ఏపీలోనే హస్తం పార్టీ దూకుడుకు బ్రేకులు వేసేందుకు కమలం పార్టీ వేస్తున్న ప్లాన్స్..పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యూపీఏ సర్కార్-1 హయాంలో అప్పటి కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చింది. 2006 ఫిబ్రవరి నెలలో ఏపీలోని అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని బండ్లపల్లి గ్రామంలో ఉపాధి హామీ పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అయితే లేటెస్ట్‌గా ఉపాధి హామీ పథకం పేరును జీ రాం జీ స్కీమ్‌గా పేరు మార్చింది కేంద్రంఅంతేకాదు ఉపాధి హామీ రూపురేఖలనే మార్చేసింది. మోదీ సర్కార్ నిర్ణయానికి వ్యతిరేకంగా..ఇప్పటికే దేశవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టింది కాంగ్రెస్ పార్టీ. ఏపీ సెంట్రిక్‌గా ప్రారంభమైన పథకంపై..అదే చోట కేంద్రం తీరుకు నిరసనగా..అతిపెద్ద ప్రొటెస్ట్‌కు ప్లాన్ చేస్తోంది. ఫిబ్రవరి 2న అనంతపురం జిల్లా బండ్లపల్లిలో షర్మిల దీక్ష చేయబోతున్నారు.ఈ సభకు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే అటెండ్ వస్తారని అంటున్నారు. ఏఐసీసీ అగ్రనేతలు కనుక ఈ దీక్షకు వస్తే.. దేశవ్యాప్త చర్చకు దారితీయడం ఖాయం. దీంతో కాంగ్రెస్‌కు ధీటుగా బీజేపీ పెద్ద స్కెచ్చే వేసిందట. ఏపీలో కాంగ్రెస్ విమర్శలను చెక్ పెట్టాలని..జీ రాం జీ స్కీమ్‌లో తెచ్చిన మార్పులతో మేలెంత అన్నది వివరించేందుకు రెడీ అయిందిఈ మధ్యే అటల్ బిహారీ వాజ్ పేయ్ శతజయంతి ఉత్సవాల పేరుతో ప్రజల్లోకి వెళ్లారు ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ పీవీఎన్ మాధవ్. ఇప్పుడు ఆయనకు ఇంకో టాస్క్ అప్పగించిందట బీజేపీ అధినాయకత్వం. జీ రాం జీ చట్టంపై..అంటే ఉపాధి హామీ పథకంలో తీసుకొచ్చిన మార్పులతో ఎంత మేలు జరగబోతోందో వివరించేందుకు పీవీఎన్ మాధవ్ యాత్ర చేపట్టబోతున్నారట.ఏపీలోని అన్ని జిల్లాలలో సభలు, సమావేశాలు పెడుతూ కొత్త చట్టం ద్వారా ప్రజలకు ఎంత ఉపయోగం జరగనుంది..గతానికి కంటే ఎక్కువగా కలిగే ప్రయోజనం ఏమిటనేది వివరించాలని చూస్తున్నారట. గతంలో ఉన్న 100 పని దినాలను 125 రోజులకు పెంచడంతో పాటు..పేదలను దృష్టిలో పెట్టుకుని పలు నిర్ణయాలను తీసుకున్నట్లు ఎక్స్‌ప్లెయిన్ చేస్తారట.కేంద్రం జాతీయ ఉపాధి హామీ పథకానికి గండి కొడుతోందని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారానికి ఇక్కడే స్ట్రాంగ్ కౌంటర్ ఇవ్వాలనేది కమలనాథుల వ్యూహంటున్నారు.

## మత్తు గంజాయి కల్తీ నుండి యువతను కాపాడండి

నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 16 (డీకే చాటింపు):రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, మత్తు పదార్థాలకు యువత బలి అవుతున్నారని వారిని కాపాడాలని స్మగ్లర్ల ను అరికట్టాలని రాష్ట్ర డీ జీ పి సి వి ఆనంద్ ను సామాజిక కార్యకర్త కొట్టురు అశోక్ విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మహా నగరంలో పబ్బులు,కాలేజీ పరిసర ప్రాంతాలలో మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని పిర్యాదు చేశారు. అంతే కాకుండా తినుబండారాలు కూడా కల్తీ చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు చాక్లెట్ లకు విద్యార్థులు బానిసలు అవుతున్నారని స్మగ్లర్ల బారిన పడకుండా కాపాడాలని కోరారు.




## వినాయక ఉత్సవాలలో నిజామాబాద్ ప్రజలు దిగువ నిబంధనలు తూ.చ తప్పకుండా పాటించాలి

### 16-09-2026 నుండి తేది:30-09-2026 వరకు ఉత్తర్వులు అమలులో ఉంటుందన్న పోలీస్ కమీషనర్



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 16(డీకే చాటింపు):వినాయక ఉత్సవాలు మరియు జండా జాతర తదితర ఉత్సవాలను పురస్కరించుకొని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ జిల్లా ప్రజలకు పలు సూచనలు చేశారు. 1) విగ్రహాల ప్రతిష్టాపన: ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా విగ్రహాలను ప్రతిష్టించరాదు, ముఖ్యంగా జనరద్దీగా ఉండే ప్రాంతాలు, పార్కులు, ఐలాండ్, ప్రభుత్వ భవనాలు లాంటి చోట్ల ఎటువంటి విగ్రహాలను ఏర్పాటు చేపట్టరాదు. విగ్రహాల ఏర్పాటుకు జిల్లా కలెక్టర్ గారి ఆద్వర్యంలోని కమిటీ యొక్క అనుమతులు తప్పనిసరిగా పొందవలసి ఉంటుంది. 2) శబ్ద కాలుష్యం నియంత్రణ: ఎక్కువశబ్దంతో డి.జే లను ఏర్పాటు చేయరాదని , ఇలా చేయడం వల్ల దీర్ఘకాలికంగా అనారోగ్యంతో బాధపడే వృద్ధులు, చిన్న పిల్లలు, మహిళలు ఇబ్బంది పడే అవకాశాలు ఉన్నందున ప్రజలుజాగ్రత్తలుపాటించాలని తెలియజేశారు. రెసిడెన్షియల్ స్థలంలో, కమర్షియల్ స్థలాల్లో రాత్రి సమయంలో 55 డెసిబెల్స్ సౌండ్ వాడాలని రాత్రి 10 గంటల నుండి ఉదయం 6 గంటల వరకు డి.జే ల సౌండ్ సిస్టం పూర్తిగా నిషేదం గలదు. పోలీసుల అనుమతి తప్పనిసరి తీసుకోవాలి అన్నారు. 3) ఊరేగింపులు, సభల నిర్వహణ: ఊరేగింపులు, బహిరంగ సభల్లో పరిమితులకు మించిన ధ్వని శబ్దం ఉత్పత్తి చేసే డి. జేలు. సౌండ్ సిస్టంలు నిజామాబాద్ కమిషనరేటు పరిధిలో నిషేదం గలదు. ఎవరైనా సభలు, సమావేశాలు జన సంచార ప్రదేశాల్లో లౌడ్ స్పీకర్లు పెట్టాలని భావిస్తే సంబంధిత అధికారుల నుండి ముందస్తుగా అనుమతి తీసుకోవాలి. 500 మందితో కూడిన సమావేశాలు లేదా సభలు నిర్వహించాలని భావిస్తే సంబంధిత అసిస్టెంటు పోలీస్ కమిషనర్ అనుమతి తప్పనిసరి 500 మంది కంటే ఎక్కువ జనాలతో కూడిన కార్యక్రమనికి 72 గంటల ముందుగా పోలీస్ కమిషనర్ గారి అనుమతి తీసుకోవాలి. 4) సార్వజనిక ప్రదేశాల్లో నియమాలు: మాల్స్, సినిమా థియేటర్స్, హోటల్స్, ఎగ్జిబిషన్, బిజినెస్ ప్రదేశాల వద్ద ప్రజల కోసం సెక్యూరిటి నిబంధనలు తప్పనిసరి పాటించాలి. ప్రతీ ఒక్కరు క్యూ పద్ధతిని తప్పనిసరి పాటించాలి. 5) డ్రోన్ల వినియోగం పై ఆంక్షలు:డ్రోన్ల వాడకం వలన ఎక్కువ ప్రమాదాలు పొంచి ఉన్న నేపద్యంలో నియంత్రణ చర్యలు తీసుకోవడం జరగుతుందని, ఈ డ్రోన్ల ఉపయోగం వలన జనజీవనానికి విఘాతం కలగడమే కాకుండా శాంతి భద్రతలకి విఘాతం వాటిల్లే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని , ఎవరయినా ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ప్రారంభించదలచినచో ముందస్తుగా సంబంధిత ప్రభుత్వ సంస్థలు, పోలీసు మరియు ఏవియేషన్ అధికారుల నుండి క్లియరెన్స్ తప్పనిసరిగా తీసుకోవాలి. 6) నకిలీ గల్ఫ్ ఏజెంట్ల నుండిఅప్రమత్తం:జిల్లాలో నకిలీ గల్ఫ్ ఏజెంట్లకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పాస్ పోర్టు, వీసా, రవాణా, టూరిస్ట్ తదితర సేవలు కల్పిస్తామని మాయమాటలు చెప్పి చాలా మంది గల్ఫ్ ఏజెంట్లు అనదికారికంగా వ్యాపారాలునిర్వహిస్తూ , అమాయక ప్రజలను మోసం చేస్తున్నారు. కావున జిల్లా ప్రజలు గల్ఫ్ ఏజెంట్లకు తమ ఇల్లు అద్దెకు ఇచ్చే ముందు జాగ్రత్తగా వ్యవహరించాలని తెలిపారు. అటువంటి వారు అద్దెకు వస్తే ముందస్తుగా వారి సమాచారాని సంబంధిత పోలీసు స్టేషన్ వారికి తెలియజేయండి. ఎవరైనా అనుమానస్పదంగా కనిపించినవెంటనేపోలీసులకు సమాచారం ఇవ్వండి. 7) " ఎ " సర్టిఫికెట్ ఉన్న సినిమాల వీక్షణం: నిజామాబాద్ జిల్లాలో " ఎ " (పెద్దలు) సర్టిఫికెట్ పొందిన సినిమాలను మైనర్లు చూడటానికి థియేటర్లను అనుమతించరాదు. 8)బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధం: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వ్యక్తులు నిజామాబాద్ వీదుల్లో చట్టాన్ని గౌరవించే పౌరుల పట్ల ముఖ్యంగా మహిళలు మరియు పిల్లల పట్ల అసభ్యకరమైన వికృత మరియు అసభ్యకరమైన ప్రవర్తన ను ప్రదర్శిస్తున్నట్లు నివేధికలు సూచిస్తున్నాయి. సాధారణంగా రోడ్డు వినియోగదారులకు మరియు ముఖ్యంగా మహిళలు మరియు పిల్లలకు చికాకు మరియు ఆటంకము కలిగించి ప్రజా ప్రశాంతతకు దారితీస్తుంది. కావున బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నిషేధిస్తూ ఆదేశాలు జారీచేయడం జరిగింది. పైన తెలియజేసిన నిబంధనలను ఎవరయిన అతిక్రమించినయెడల వారిపై సంబంధిత చట్టాల ప్రకారం తగు చర్యలు తీసుకోవడానికి నిజామాబాద్ పోలీస్ కమిషనరేటు పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లోని పోలీస్ స్టేషన్ ఎస్.హెచ్.ఓ లకు, ఎస్.ఐ లకు నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, ఐ.పి.ఎస్. అధికార ఉత్తర్వులను జారీ చేశారు. కావున ప్రజలందరూ సంబంధిత పోలీస్అధికారుల కు సహకరించగలరు. బుల్లెట్ సీజ్ శబ్ద కాలుష్యం, పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన బుల్లెట్ బైక్ సీజ్ చేసి ఆకతాయిపై బాల్కొండ పోలీసుల కేసు నమోదు చేశారని వివరించారు.శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్లకు ఎలాంటి అనుమతి లేదు అని నిజామాబాద్ పోలీస్ కమిషనర్చెప్పారు.బాల్కొండ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వేళ బుల్లెట్ ద్విచక్ర వాహనానికి శబ్ద కాలుష్యానికి కారణమయ్యే సైలెన్సర్‌ను అమర్చుకొని, ప్రజలకు ఇబ్బంది కలిగించే విధంగా నిర్లక్ష్యంగావాహనంనడుపుతూ పబ్లిక్ న్యూసెన్స్‌కు కారణమైన వ్యక్తిపై బాల్కొండ పోలీసులు కేసు నమోదు చేశారన్నారు.

# ఆల్ ఇన్ వన్ స్మార్ట్ కార్డులు




ఏలూరు: పాలనలో సరికొత్త సంస్కరణలు తీసుకువస్తున్న ఏపీ ప్రభుత్వం మరో సరికొత్త ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని నిర్ణయించింది. ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ కింద ఈ కార్డులను అందించనున్నారు. సోమవారం రోజున జరిగిన సమీక్షా సమావేశంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులపై అధికారులకు సీఎం చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. జూన్ నాటికి రాష్ట్రంలో స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు పౌరసేవలను మరింత వేగంగా, పారదర్శకంగా అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా పాలనాపరంగా పలు సంస్కరణలు తీసుకువస్తోంది. ఈ క్రమంలోనే పాలనలో టెక్నాలజీ వినియోగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఇందులో భాగంగా ఇప్పటికే స్మార్ట్ రేషన్ కార్డులు అందించిన ఏపీ ప్రభుత్వం.. ఇప్పుడు మరో స్మార్ట్ ఆలోచన చేస్తోంది. రాష్ట్రంలోని కోటీ 40 లక్షల కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు అందించాలని ఆలోచన చేస్తోంది. ఫ్యామిలీ కార్డు బెనిఫిట్ సిస్టమ్ ద్వారా వచ్చే జూన్ కల్లా రాష్ట్రంలోని కుటుంబాలకు స్మార్ట్ ఫ్యామిలీ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు.సంజీవని ప్రాజెక్టు, జనాభా నిర్వహణ, పౌష్టికాహారం వంటి అంశాలపై సీఎం చంద్రబాబు నాయుడు సోమవారం రోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. సంజీవని ప్రాజెక్టు కింద జులై నాటికి రాష్ట్రంలోని 66 లక్షల హైరిస్క్ కేసులకు హెల్త్ స్క్రీనింగ్ చేయాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ క్రమంలోనే ఫ్యామిలీ బెనిఫిట్ కార్డుల గురించి చంద్రబాబు చర్చించారు. జూన్ నాటికి రాష్ట్రంలోని కుటుంబాలకు వీటిని పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరోవైపు వచ్చే సంవత్సరానికి ఏపీని ఎయిడ్స్ రహిత రాష్ట్రంగా ప్రకటిస్తామని చంద్రబాబు తెలిపారు.మరోవైపు ఈ ఏడాది జూన్‌లోగా స్మార్ట్ ఫ్యామిలీ కార్డులను ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు పంపిణీ చేయనుంది. ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే ఆ కుటుంబం సమాచారం, వారికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలు, పీ4 అంశాలు వంటివి తెలిసేలా ఈ కార్డులను డిజైన్ చేయనున్నారు.అలాగే ఈ కార్డుల సాయంతో రేషన్ కార్డు సేవలు, ఉపకార వేతనాలు, కులధ్రువీకరణ పత్రాలు, పింఛన్ల వివరాలు, వ్యాక్సినేషన్ వంటి వివరాలను ట్రాక్ చేసేలా ప్రణాళికలు రచిస్తున్నారు. స్మార్ట్ ఫ్యామిలీ కార్డులలో కుటుంబం మొత్తం వివరాలు ఉండటంతో.. సంక్షేమ పథకాల అమలు సమయంలో అర్హులకు లబ్ధి చేకూరనుంది. అలాగే పౌరసేవలు వేగంగా అందుబాటులోకి వస్తాయి.

## అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నచైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి



ఎల్బీనగర్ సెప్టెంబర్ 16 (డీకే చాటింపు)
గణేష్ చవితి సందర్బంగా చైతన్యపురి డివిజన్ లోని విద్యుత్ నగర్ కాలనీలో సాయి సైన్ అపార్ట్మెంట్స్, సీనియర్ నాయకురాలు శోభారాణి ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చైతన్యపురి డివిజన్ బిఆర్ఎస్ పార్టీ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి.

## కోటగిరి అయ్యప్ప దేవాలయంలో అన్నదానం



నిజామాబాద్ ప్రతినిధి సెప్టెంబర్ 16 ( డీకే చాటింపు): కోటగిరి అయ్యప్ప దేవాలయంలో బుధవారం రోజు ఘనంగా పూజలు చేశారు.మధ్యాహ్నం అన్నదానం మునిగల శ్వేత నరేష్ పోతంగల్ వారు ఏర్పాటు చేశారని సాయిలు గురుస్వామి తెలిపారు.కోటగిరి ధర్మశాస్త్ర శ్రీ అయ్యప్ప స్వామి వారి దేవాలయంలో అన్న ప్రసాదం తో పాటు పది పూజ అనంతరం అల్పహారం పద్మ యోగి రుద్రూరు ఏర్పాటు చేశారన్నారు.కాబట్టి అయ్యప్పస్వాములు ,భక్తులు మహిళలు(మాత )స్వాములు సకాలంలో విచ్చేసి స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించాలనికమిటీ నిర్వాహకులు పోలా అశ్విన్ కోరారు.

డీకే సారథ్యంలో చాటింపు
తెలంగాణ దిన పత్రిక
గురువారం, సెప్టెంబర్,17, 2026

## యెల్లో మెటల్ ధరల పతనానికి
# రష్యా మాస్టర్ స్ట్రోక్..

రష్యా తీసుకున్న ఒక కీలక నిర్ణయం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ధరలపై పెను ప్రభావం పడే అవకాశం ఉందన్న వార్తలు ఇప్పుడు మదుపర్లలో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. బంగారం ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. గతేడాది కాలంగా గోల్డ్ ధరలు అంతకంతకూ పెరుగుతూ రికార్డులు క్రియేట్ చేస్తుంది. అటు వెండి సైతం బంగారంతో మించి పైపైకి దూసుకెళ్తుంది. అయితే నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా దూసుకుపోయిన పసిడి ధరలు ఇప్పుడు దిగివచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. గత కొంతకాలంగా భారత్‌లో ఒక సావరిన్ (ఎనిమిది గ్రాముల) బంగారం ధర రూ. 1,15,000 మార్కును దాటి.. సామాన్యులకు ఎనిమిదవ వింతలా మారుతుందేమోనన్న ఆందోళన కలిగించింది. అయితే తాజాగా అంతర్జాతీయ మార్కెట్‌లో చోటుచేసుకున్న అనూహ్య పరిణామాలు బంగారం ధరల పతనానికి నాంది పలికాయి. జనవరి 29 నుండి బంగారం ధరల్లో స్థిరమైన తగ్గుదల కనిపిస్తోంది. త్వరలోనే ఇది రూ. 1 లక్ష కంటే కిందికి పడిపోయే అవకాశం ఉందని మార్కెట్ నిపుణులు విశ్లేషిస్తున్నారు భారత మార్కెట్‌లో బంగారం ధరలు అనూహ్యంగా రూ. 1 లక్ష దిగువకు పడిపోయే అవకాశం ఉందన్న అంచనాలు వెలువడుతున్నాయి. రష్యా తన బంగారు నిల్వలను భారీగా విక్రయించాలని లేదా మార్కెట్‌లోకి వదలాలని తీసుకున్న నిర్ణయం వల్ల సరఫరా పెరిగి ధరలు తగ్గవచ్చని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం రికార్డు స్థాయి ధరలతో ఉన్న పసిడి, ఈ పరిణామంతో సామాన్యులకు కొంత ఊరటనిచ్చే దిశగా సాగుతోంది. కామెక్స్ గోల్డ్ ధరలు త్వరలో ఔన్సుకి 3,000 డాలర్ల మార్కును తాకే అవకాశం ఉందని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. రష్యా కదలికల వల్ల డాలర్ ఇండెక్స్‌లో వచ్చే మార్పులు , భౌగోళిక రాజకీయ పరిస్థితులు పసిడి ధరను ప్రభావితం చేయనున్నాయి. సరఫరా, డిమాండ్ మధ్య ఉన్న సమతుల్యత దెబ్బతినడం వల్ల ధరల్లో తీవ్రమైన హెచ్చుతగ్గులు చోటుచేసుకునే అవకాశం ఉంది. భారతదేశం ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద బంగారం వినియోగదారు కావడంతో, అంతర్జాతీయ మార్కెట్ మార్పులు నేరుగా ఇక్కడి ధరలపై ప్రభావం చూపుతాయి. రష్యా నుండి వచ్చే సమాచారం నిజమైతే, దేశీయంగా 10 గ్రాముల బంగారం ధర గణనీయంగా తగ్గే అవకాశం ఉంది. అయితే, ఇదే సమయంలో రూపాయి విలువ పతనం వంటి ఇతర అంశాలు కూడా ధరలను నియంత్రించవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. బంగారం ధరలు తగ్గవచ్చనే అంచనాల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు సూచిస్తున్నారు. ఒకవైపు ధరల పతనం ఆకర్షణీయంగా కనిపించినా, రష్యా వంటి పెద్ద ఆర్థిక శక్తుల నిర్ణయాలు మార్కెట్‌ను త్వరగా మార్చగలవు. అందుకే దీర్ఘకాలిక పెట్టుబడుల విషయంలో వ్యూహాత్మక నిర్ణయాలు తీసుకోవడం ఉత్తమమని వారు అభిప్రాయపడుతున్నారు. బంగారం ధరలు అకస్మాత్తుగా తగ్గడానికి ప్రధాన కారణం రష్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయం. బ్లూమ్‌బెర్గ్ నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ వాణిజ్యంలో రష్యా తిరిగి అమెరికా డాలర్‌ను ఉపయోగించాలని నిర్ణయించుకుంది. గతంలో డాలర్‌ను బలహీనపరిచేందుకు రష్యా, చైనా వంటి దేశాలు భారీగా బంగారాన్ని నిల్వ చేశాయి. అయితే ఇప్పుడు రష్యా తిరిగి డాలర్ వైపు మొగ్గు చూపడంతో గ్లోబల్ మార్కెట్‌లో డాలర్ విలువ అనూహ్యంగా పెరుగుతోంది. సాధారణంగా డాలర్ విలువ పెరిగినప్పుడు, అంతర్జాతీయ ఇన్వెస్టర్లు సురక్షితమైన పెట్టుబడిగా భావించే బంగారం నుండి తప్పుకుని డాలర్ వైపు మళ్లుతారు. దీనివల్ల బంగారంపై డిమాండ్ తగ్గి ధరలు పడిపోతాయి.ట్రంప్ విధించిన ఆర్థిక ఆంక్షలను ధిక్కరించేందుకు ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఒక కూటమిగా ఏర్పడి డాలర్‌ను కాదని బంగారాన్ని నిల్వ చేశాయి. కానీ రష్యా ఇప్పుడు తన వైఖరిని మార్చుకుని తిరిగి డాలర్ ఆధారిత ట్రేడింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వడం ప్రపంచ వాణిజ్య ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేసింది. ఇది ప్రపంచవ్యాప్తంగా బంగారం నిల్వలను మార్కెట్లోకి తెచ్చేలా ప్రేరేపిస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాల్లో 22 క్యారెట్ల బంగారం ధర రూ. 1,15,000 వద్ద ట్రేడ్ అవుతోంది. కానీ నిపుణుల అంచనా ప్రకారం.. యుద్ధ వాతావరణం, రాజకీయ అస్థిరత తగ్గడం వల్ల బంగారంపై ఒత్తిడి తగ్గింది. అంతర్జాతీ యంగా డాలర్ పుంజుకోవడం వల్ల భారత్‌లో పసిడి ధర లక్ష రూపాయల లోపుకు చేరుకోవడం ఖాయమని తెలుస్తోంది.




# ఆర్మూర్ పివీఆర్ భవన్‌లో కేక్ కటింగ్

## పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ పదవి 2సంవత్సరాల విజయం

ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 16 (డీకే చాటింపు ):పి సి సి అధ్యక్షులు మహేష్ కుమార్ గారు 2 సంవత్సరాల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా PVR భవన్ లో మధ్యాహ్నం12:00 గంటలకు కేక్ కటింగ్ కార్యక్రమం ఉందని ఆర్మూర్ పట్టణ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు సాయిబాబా గౌడ్ తెలిపారు .2 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా విజయోత్సవం కేక్ కటింగ్ ఉంటుందని,ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు,మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ,కౌన్సిలర్ లు,జాంబీ హనుమాన్,సిద్ధుల గుట్ట ఆలయ కమిటీ సభ్యులు,యువజన కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొనగలరని పిలుపు ఇచ్చారు.




## గణేష్ మండపాల వద్ద భద్రత ఏర్పాట్లను
# పరిశీలించిన సి పి సాయి చైతన్య





ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 16 (డీకే చాటింపు): నిజామాబాద్ నగరంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంతమైన వాతావరణంలో , ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు పోలీస్ శాఖ పటిష్టమైన భద్రతా చర్యలు చేపడుతుందని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. ఇందులో భాగంగానగరంలోని పలు గణేష్ మండపాలను సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. గణేష్ మండపాల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది వివరాలు , బందోబస్తు పాయింట్లు , సిబ్బంది అప్రమత్తత తదితర అంశాలను పరిశీలించారు. అలాగే ప్రతి మండపం వద్ద నిర్వహిస్తున్న పాయింట్ బుక్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేసి , సిబ్బంది విధుల్లో భాగంగా నమోదు చేస్తున్న వివరాలను పరిశీలించారు. మండపాల వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన భద్రతా చర్యలు చేపట్టాలని , ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి , అనుమానాస్పద వ్యక్తులు , వస్తువులపై అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గణేష్ ఉత్సవాలు మరియు నిమజ్జన కార్యక్రమాలు శాంతియుతంగా సురక్షితంగా జరిగేలా పోలీస్ అధికారులు , సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహించాలని కమిషనర్ సూచించారు. ప్రజలు , గణేష్ మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖకు సహకరించి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా టౌన్ ఏసిపి ప్రకాష్ , టౌన్ 1 ఎస్హెచ్ఓ బి. రఘుపతి , ఎన్. ఐ. బి సీఐ అశోక్ మరియు సిబ్బంది కమిషనర్ వెంట ఉన్నారు.

## రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్
# ఆకస్మికంగా తనిఖీ చేసిన సిపి








క్యాతన పల్లి (డీకే చాటింపు): రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ను వార్షిక తనిఖీలో భాగంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ బుధవారం తనిఖీ చేశారు స్టేషన్కు చేరుకున్న సీపీకి సీఐ రమేష్, ఎస్ఐ శ్రీధర్ మొక్క అందజేసి స్వాగతం పలికారు.సిబ్బంది గౌరవ వందనం స్వీకరించిన సీపీ పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు.స్టేషన్ పరిసరాలు, సిబ్బంది బ్యారక్, రిసెప్షన్ కేంద్రం, రికార్డులను పరిశీలించిన సీపీ పరిశుభ్రత, 5ఎస్ విధానం అమలు,వాహనాల క్రమబద్ధ నిర్వహణపె సూచనలు చేశారు. సీసీటీఎన్ఎస్ ద్వారా కేసుల వివరాల నమోదు, రికార్డుల అప్లోడ్ ప్రక్రియను పరిశీలించారు. పెండింగ్ కేసులు,దర్యాప్తు పురోగతి, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలు, గస్తీ, కనిపించేలా పోలీసింగ్ తదితర అంశాలపై ఎస్ఐను అడిగి వివరాలు
తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ..... పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా, మానవీయ దృక్పథంతో వ్యవహరించి వారి సమస్యలను చట్టపరిధిలో త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హైవే,రైల్వే స్టేషన్, కొత్త కాలనీలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో శాంతిభద్రతలు, రహదారి భద్రత,మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. రైలు, రోడ్డు మార్గాల ద్వారా జరిగే గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెంచాలని ఆదేశించారు.ప్రజల భాగస్వామ్యంతో సీసీటీవీ కెమెరాల ఏర్పాటుతో ఆస్తి నేరాల నియంత్రణలో మంచి ఫలితాలు సాధిస్తున్న సిబ్బందిని సీపీ అభినందించారు.కొత్త కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ కాలనీల్లో వృద్ధుల భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ బ్లూకోట్స్ సిబ్బంది క్రమం తప్పకుండా పర్యటించాలని, వృద్ధుల భద్రతకు ప్రత్యేక కార్యాచరణ విధానం అమలు చేయాలని సూచించారు. పోలీస్ సిబ్బంది శారీరక దృఢత్వంతో పాటు స్టేషన్ నిర్వహణపై శ్రద్ధ వహించాలని తెలిపారు. రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ నిర్వహణ బాగుందని పేర్కొంటూ ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. ఈ తనిఖీలో సీఐ రమేష్, ఎస్ఐ శ్రీధర్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆశ్విని అనుమానాస్పద మృతి ఘటనపై
# మానవ హక్కుల కమిషన్ స్పందన

### రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు నోటీసులు.. నవంబర్ 9లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ఆదేశం

రంగారెడ్డి, సెప్టెంబర్16 (డీకే చాటింపు) రంగారెడ్డి జిల్లా ఫరూక్‌నగర్ మండలం కమ్మదనం గురుకులంలో ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆశ్విని అనుమానాస్పద మృతి ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ స్పందించింది. జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు, న్యాయవాది దుంద్ర కుమారస్వామి దాఖలు చేసిన ఫిర్యాదు ఆధారంగా హెచ్ఆర్ కేసు నం. 3641/2026లో రంగారెడ్డి జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్‌కు కమిషన్ నోటీసులు జారీ చేసింది. ఘటనకు సంబంధించిన సమగ్ర నివేదికను 2026 నవంబర్ 9లోగా సమర్పించాలని ఆదేశించింది. విద్యార్థిని మృతి ఘటనకు సంబంధించిన పరిస్థితులు, విద్యార్థుల భద్రత, సంస్థాగత బాధ్యతలపై సమగ్ర వివరాలను నివేదికలో పొందుపరచాల్సి ఉంది. ఫిర్యాదులో పేర్కొన్న అంశాల నేపథ్యంలో ఘటనకు ముందు, తరువాతి పరిస్థితులు, పర్యవేక్షణ, వైద్య సహాయం, సంబంధిత అధికారుల విధుల నిర్వహణ వంటి అంశాలపై వాస్తవాలను పరిశీలించాల్సిన అవసరం ఉంది. కమిషన్ తదుపరి విచారణను నవంబర్ 9న ఉదయం 11 గంటలకు చేపట్టనుంది. నివేదికను మూడు ప్రతుల్లో సమర్పించాలని నోటీసులో స్పష్టం చేసింది. ప్రభుత్వ గురుకులాల్లో విద్యార్థుల ప్రాణాలు, గౌరవం, భద్రతకు మరింత బలమైన రక్షణ వ్యవస్థ అవసరమని దుంద్ర కుమారస్వామి పేర్కొన్నారు. ఆశ్విని మృతి ఘటనపై వాస్తవాలు వెలుగులోకి రావడంతో పాటు, రాష్ట్రంలోని గురుకుల విద్యాసంస్థల్లో భద్రత, వసతి గృహాల పర్యవేక్షణ, అత్యవసర



Dis N 5913

FORM - A
Regulation 16[b]
By Post

TELANGANA HUMAN RIGHTS COMMISSION
"Gruhakalpa", M.J. Road, Hyderabad - 500001.
Tel : 040-24601572 Fax : 040-24601573
NOTICE

H.R.Case No. 3641/2026 Dated 08/09/2026

To

1.The Collector and District Magistrate,
Ranga Reddy District,
at Kongara Kalan Village,
Ibrahimpatnam Mandal,
Telangana – 501510

Whereas the complaint / letter received from Mr. Dundra Kumaraswamy was considered by the Commission and the following order was passed :-

Call for a report from the Collector and District Magistrate, Ranga Reddy District, by 09-11-2026.

Now, THEREFORE TAKE NOTICE that the above mentioned matter will be listed for further consideration before the Commission on 09-11-2026 and will be taken up on that day at 11.00 a.m. before which date you are required to submit the requisite information / report (3sets).

Take FURTHER NOTICE that in the event of any default, the Commission may proceed to take such action as it deems proper.

Dated - 07/09/2026
//BY ORDER//

Assistant Registrar(Judicial)

For Information to :
Mr. Dundra Kumaraswamy

వైద్య స్పందన, విద్యార్థుల ఫిర్యాదుల పరిష్కారం, మానసిక సహాయ వ్యవస్థలపై ప్రత్యేక మానవ హక్కుల ఆడిట్ నిర్వహించాలని ఆయన కోరారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ, బాధ్యత నిర్ధారణ, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు

## ఆర్మూర్ పట్టణంలో
## అనుమతి లేని డి జె లు సిజ్



ఆర్మూర్ విలేకరి సెప్టెంబర్ 16(డీకే చాటింపు):ఆర్మూర్ పట్టణం లోని ఎస్ఐ లు ఎండీ.యాసీర్ అరాఫత్ వి. రజనీకాంత్ ఆధ్వర్యంలో అనుమతి లేకుండా డీజే పెట్టిన రెండు వాహనాలు సిజ్ చేసి నలుగురిపై కేసు నమోదు చేసారు. నిజమాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ మున్సిపల్ పట్టణ కేంద్రం రోజున ఎటువంటి ముందస్తు అనుమతి లేకుండా వినాయక విగ్రహాల ఆగమనం ఊరేగింపులో పెద్ద శబ్దాలతో డీజేలు నిర్వహించిన రెండు వాహనాలను పోలీసులు సీజ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి నలుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ లు తెలిపారు

## ఆర్మూర్ కు నిధులివ్వండి
## లేదా ఎమ్మెల్యే పదవికి
## రాజీనామా చేస్తా



ఆర్మూర్ విలేఖరి సెప్టెంబర్ 16(డీకే చాటింపు): అసెంబ్లీ సమావేశాలలో బుధవారం నాడు ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి మాట్లాడుతూ ఈ సందర్భంగా ఎన్నో ఏండ్లుగా ఆర్మూర్ లో శిథిలావస్థలో ఉన్న రెవెన్యూ కార్యాలయాల గురించి అడుగుతున్న పట్టించుకునే నాధుడే లేడని అవసరమైతే రాజీనామా కూడా చేస్తానని మంత్రులు సీఎం వారి నియోజక వర్గాలకు నిధులు ఎలా కేటాయిస్తున్నారో అన్ని తమ వద్ద ఉన్నాయని మాకు కూడా కొంత మేర నిధులు కేటాయించి ప్రభుత్వ కార్యాలయాలు పూర్తిచేయాలని ప్రభుత్వం ఆర్మూర్ పై దయ చూపాలని 27 కోట్లు రెవెన్యూ కార్యాలయం కోసం మంజూరు చేయాలని లేనిపక్షంలో తక్షణమే రాజీనామా చేయడానికి కూడా సిద్ధమని ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి తెలిపారు.

## గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు పూజా కార్యక్రమం పాల్గొన్న మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్




ఎల్బీనగర్ సెప్టెంబర్ 16 (డీకే చాటింపు) మాధవ నగర్ కాలనీలో గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు పూజా కార్యక్రమం పాల్గొన్న సభ్యులు మాధవ నగర్ కాలనీ అధ్యక్షులు గోపాల్ ముదిరాజ్ మరియు వాస్తు జంగారెడ్డి దిండి నారాయణరెడ్డి పురుషోత్తం రెడ్డి లక్ష్మారెడ్డి విక్రమ్ రాజు రాజేందర్ రెడ్డి ముత్యాలు మోహన్ రెడ్డి మోహన్ రెడ్డి సత్యనారాయణ కడారి రాజేష్ యాదవ బొడ్ల మల్లికార్జున్ గుప్తా మొదలగువారు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు

## వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము(, ఆధ్వర్యంలో 39వ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు

మహేశ్వరం, సెప్టెంబర్ 16 (డీకే చాటింపు) ఆర్కే పురం డివిజన్ పరిధిలోని వాసవి కాలనీలో వాసవి కాలనీ నివాసుల సంక్షేమ సంఘము(ఎజ=ఔూ) అధ్యక్షుడు గౌరిశెట్టి చంద్ర శేఖర్ గుప్తా ఆధ్వర్యంలో మహాగణపతి 39వ నవరాత్రి మహోత్సవాలు వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా రెండొవ రోజు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. రెండొవ రోజు పూజ కార్యక్రమంలో ముఖ్య అతిథిలు గా టి ఎస్ ఆర్ టి సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీధర్ టి ఎస్ ఆర్ టి సి డిపో మేనేజర్ సమతా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వాసవి కాలనీ ప్రధాన కార్యదర్శి అయిత అంజయ్య, కోశాధికారి కృష్ణయ్య ఉత్సవ కమిటీ కన్వీనర్ వెంపటి కృష్ణమోహన్, చిలుక ఉపేందర్ రెడ్డి, గౌరిశెట్టి. అరుణ్ కుమార్, వనమా సుదర్శన్, గ్రంథి రమేష్, తమన్నా శ్రీధర్, దండు రాజు, గందే శ్రీకాంత్, గౌరీ శంకర్, సత్యనారాయణ, డా. రాంకిషన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, పి.శ్రీకాంత్, కృష్ణ మూర్తి, రామ స్వామి తదితరులు పాల్గొన్నారు.



# అంతా జెనీమయం!





హైదరాబాద్: మీరు ఏది కోరుకుంటే దాన్ని నెరవేర్చే 'అల్లావుద్దీన్ అద్భుత దీపం' గురించి వినే ఉంటారు కదా? ఇప్పుడు టెక్ ప్రపంచంలో అలాంటి ఓ మ్యాజిక్‌నే నిజం చేయబోతున్నది గూగుల్. అవును.. సుందర్ పిచాయ్ఇటీవల ప్రకటించిన'ప్రాజెక్ట్ జెనీ' ఇప్పుడు ఇంటర్నెట్ లోకంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. 'ఇది ఈ లోకానికి చెందని టెక్నాలజీ' అని గూగుల్ సీఈవో వర్ణించారంటే.. మనం ఊహించే ఏఐ కంటే ఇది ఎన్నిరెట్లు పవర్‌ఫుల్‌గాఉండబోతున్నదో అర్థం చేసుకోవచ్చు. అసిస్టెంట్ నుంచి అడ్వైజర్ వరకు.. మీ ప్రతి అవసరాన్ని ముందే పసిగట్టేస్తుందట ఈ సరికొత్త 'డిజిటల్ జెనీ'. ఇప్పటివరకూ చూసిన చాట్‌బాట్లు మనం అడిగిన దానికి మాత్రమే సమాధానం ఇస్తాయి. కానీ 'ప్రాజెక్ట్ జెనీ' అలా కాదు. ఇది మీ అవసరాలను, మీ ఆలోచనలను ముందే పసిగట్టే.. ఓ 'ప్రోయాక్టివ్ ఏఐ'.

మల్టీ–మోడల్ పవర్: ఇది కేవలం టెక్ట్స్ మాత్రమే కాదు.. మీరు చూస్తున్నది, వింటున్నది.. అంతేకాదు.. మీ చుట్టూ ఉండే పరిసరాలను కూడా అర్థం చేసుకుంటుంది. మీరు ఏదైనా పనిలో ఇబ్బంది పడుతుంటే.. మీరు అడగకముందే 'నేను సహాయం చేయనా?' అని అడుగుతుంది. అందుకే దీన్ని గూగుల్ తన అత్యంత శక్తిమంతమైన ఏఐ మోడల్‌గా పేర్కొంటున్నది. సుందర్ పిచాయ్ దీన్ని అంతలా పొగడటానికీ ఓ కారణం ఉంది. ఇది కేవలం సాఫ్ట్‌వేర్ మాత్రమే కాదు. మన దైనందిన జీవితంలో ఓ భాగం కాబోతున్నది. మనిషికి, యంత్రానికి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించే ఓ అద్భుత వంతెన ఇది. మనిషి టెక్నాలజీని వాడే విధానాన్నే పూర్తిగా మార్చేయబోతున్నది. మీ ఫోన్, ల్యాప్‌టాప్, చివరికి మీ ఇంటి స్మార్ట్ డివైజ్‌లతో అనుసంధానమై.. ఓ అదృశ్య నేస్తంలా మీకు తోడుగా ఉంటుంది. మీరు బిజీగా ఉన్నప్పుడు మీ మెయిల్స్ షెడ్యూల్ చేయడం మొదలుకొని, మీ మూడ్‌ను బట్టి మ్యూజిక్ ప్లే చేయడం వరకూ అన్నీ ఈ 'జెనీ'నే చూసుకుంటుంది.

ఏఐ రేసులో గూగుల్ మార్క్!: ఏఐలో మైక్రోసాఫ్ట్, ఓపెన్ ఏఐ వంటి దిగ్గజాలు పోటీ పడుతున్న తరుణంలో.. 'ప్రాజెక్ట్ జెనీ'తో గూగుల్ తన ఆధిపత్యాన్ని చాటుకోవాలని చూస్తున్నది. ఇందులో వాడిన అల్గారిథమ్స్ మునుపెన్నడూ లేనివిధంగా అత్యంత వేగంగా డేటాను ప్రాసెస్ చేస్తాయి. కేవలం ఇన్ఫర్మేషన్ ఇవ్వడమే కాదు.. క్లిష్టమైన సమస్యలకు పరిష్కారాలనూ సూచిస్తుంది. ఈ ప్రాజెక్ట్ మన చేతుల్లోకి వస్తే.. 'స్మార్ట్ లైఫ్' అనే పదానికి కొత్త నిర్వచనం లభిస్తుందనడంలో సందేహం లేదు. టెక్నాలజీ మన ఊహల కంటే వేగంగా దూసుకెళు_న్నది. అల్లావుద్దీన్ దీపంలోని జెనీ.. కేవలం మూడు కోరికలే తీరుస్తుంది. గూగుల్ 'జెనీ' మాత్రం.. మన డిజిటల్ ప్రపంచంలో మరెన్నో అద్భుతాలు చేస్తుంది. వాటిని ప్రత్యక్షంగా చూడాలంటే.. కొన్ని రోజులు వేచి చూడాల్సిందే!

# మనిషే చరిత్ర నిర్మాత





ఒకప్పుడు ఇతర జంతువులతో పాటు అడవుల్లో నివశించి, తన మేధో శక్తితో ఆధునిక మానవుడిగా ఎదిగిన వైనాన్ని వివరించే శాస్త్రాన్ని మానవ శాస్త్రం అంటారు. చరిత్ర క్రమాన్ని వివరించడానికి ఈ శాస్త్రం ఉపయోగపడుతుంది. ఆంత్రోపాలజీ (మానవ శాస్త్రం) అనేది ప్రాచీన, ప్రస్తుత మానవ ప్రవర్తన, జీవశాస్త్రం, సంస్కృతులు, భాషాశాస్త్రాల గురించి అధ్యయనం చేస్తుంది. ఆంత్రోపాలజీ చదవడం వల్ల వైద్యం, ప్రజారోగ్యం, వ్యాపారం, పర్యావరణ పరిరక్షణ, మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్సెస్, ఫోరెన్సిక్, మ్యూజియం వంటి రంగాలలో ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

మానవ శాస్త్రము ఒక జీవ శాస్త్రం మాత్రమే కాక ప్రపంచంలో వేర్వేరు జాతుల, తెగల ప్రజలు, వారి మధ్య చారిత్రాత్మకంగా ఏర్పడిన భేదాలను కూడా తెలిపే సాంఘిక శాస్త్రం కూడా. మానవ శాస్త్రజ్ఞులు అనేక ప్రాంతాలలో పరిశోధనలు చేసి ప్రజలు ప్రస్తుతం ఎలా జీవిస్తున్నారో, పూర్వం ఎలా జీవించేవారో పురావస్తు శాస్త్రము ప్రకారంగా అధ్యయనం చేస్తారు. ఈ అధ్యయనాలు ఆధునిక నగరాల నుంచి పల్లెటూర్లు, అడవిలో నివసించే తెగల దాక విస్తరిస్తూ ఉంటాయి. వివిధ సమూహాల్లో జనం సమయాన్ని, స్థలాన్ని, జీవన శైలిని ఎలా అవగాహన చేసుకున్నారో, ఈ అధ్యయనాలు పరిశీలిస్తాయి. అమెరికన్ ఆంత్రోపోలాజికల్ అసోసియేషన్ 2015లో జాతీయ ఆంత్రోపాలజీ దినోత్సవాన్ని ప్రారంభించింది. మరుసటి సంవత్సరం, వారు దానిని ప్రపంచ ఆంత్రోపాలజీ దినోత్సవంగా మార్చారు. ఆంత్రోపాలజీ ఒక దేశానికి మాత్రమే కాకుండా మొత్తం ప్రపంచానికి ముఖ్యమైనది. ఇందులో పురావస్తు శాస్త్రం చాలా ముఖ్యమైంది. సహజంగా ఇది ప్రతి ఏటా ఫిబ్రవరి మూడవ గురువారం వస్తుంది. ఈ లెక్క ప్రకారం ఈ ఏడాది  న వచ్చింది. మనిషి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొని ఆధునిక మానవుడిగా ఎదిగాడు. దీనికోసం ఎన్నో పోరాటాలు చేశాడు. మరెన్నో రాజ్యాలను ఆక్రమించుకున్నాడు. మత భావనలను దాటి సైన్స్‌లో ఎన్నో ఆవిష్కరణలు చేశాడు. ఎన్నో వ్యాధులకు నివారణ మార్గాలు కనిపెట్టాడు. ప్రతి పూర్వ తరం తర్వాత తరానికి అభివృద్ధి చెందిన ప్రపంచాన్ని వారసత్వంగా ఇచ్చింది. సైన్స్ అభివృద్ధితో దేశాల మధ్య సరిహద్దులు తొలిగాయి. కొత్త అవకాశాలు వచ్చాయి.

సృజనాత్మకత ప్రతి రంగంలో పెరుగుతుంది. కొత్త నైపుణ్యాలు అవసరం ఏర్పడుతుంది. మకొన్ని సవాళ్లు కూడా ఈ క్రమంలో ఎదురౌతున్నాయి. ప్రస్తుతం కృత్రిమ మేధ రాజ్యమేలుతున్నది. ఇంకా కొన్ని దేశాల పాలకులు సంకుచిత భావనలతోనే ప్రజలను పాలిస్తున్నారు. ఇంకా ప్రపంచాన్ని యుద్ధ మేఘాలు ఎక్కడో ఒక చోట ఆవరిస్తూనే ఉన్నాయి. ఒకవైపు పెరుగుతున్న మతోన్మాదం, మరోవైపు వాతావరణ కాలుష్యం ప్రపంచాన్ని తిరోగామి దిశలోకి నెడుతున్నాయి. ఈ నేపథ్యంలో మనిషి తన చరిత్రను పురోగామి దిశలో పయనింపజేయడానికి ఎటువంటి చర్యలు తీసుకుంటాడనేది ఒక ఆసక్తికరమైన ప్రశ్న అవుతుంది.

# నెయ్యి టెండర్లలలో కొత్త పద్ధతికి శ్రీకారం



తిరుమల, : తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వినియోగించే ఆవు నెయ్యి కొనుగోలు ప్రక్రియలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. లడ్డూ నాణ్యత, స్వచ్ఛత విషయంలో భక్తుల నమ్మకాన్ని నిలబెట్టేలా, పారదర్శకతకు పెద్దపీట వేస్తూ కొత్త విధానాన్ని అమలులోకి తెచ్చింది. చైర్మన్ బీఆర్ నాయుడు నేతృత్వంలోని నూతన టీటీడీ బోర్డు ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకుంది.గతంలో, అంటే 2024కు ముందు, శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై భక్తుల నుంచి కొన్ని విమర్శలు, అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఈ నేపథ్యంలో స్పందించిన టీటీడీ, నెయ్యి కొనుగోలు విధానాన్ని సమూలంగా మార్చాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా పలు కఠిన నిబంధనలను ప్రవేశపెట్టింది. నెయ్యి నాణ్యత రవాణా సమయంలో దెబ్బతినకుండా ఉండేందుకు, సేకరణ భౌగోళిక పరిధిని గతంలో ఉన్న 1500 కిలోమీటర్ల నుంచి 800 కిలోమీటర్లకు తగ్గించారు. నెయ్యిని సరఫరా చేసే ట్యాంకర్లకు తప్పనిసరిగా జీపీఎస్ లాక్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసి, రవాణాను నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నారు.నాణ్యత పరీక్షల విషయంలోనూ రాజీపడకుండా కఠిన ప్రమాణాలను నిర్దేశించారు. డైరీల తయారీ సామర్థ్యాన్ని అంచనా వేయడానికి ఓఖీఓ స్కోర్ బోర్డ్ విధానాన్ని, ఈూాఖీ 2.1.8 నిబంధనలతో పాటు మిల్క్ ఫ్యాట్ ప్యూరిటీ పరీక్షలు (ఎూా 17678:2019), సెన్సరీ పారామీటర్స్ (ఎూ అనీటవ: 7770:1975) వంటివి తప్పనిసరి చేశారు. ఈ సంస్కరణల్లో భాగంగా, 2024–25 సంవత్సరానికి గాను గుత్తాధిపత్యానికి తావివ్వకుండా మొత్తం 65 లక్షల కిలోల నెయ్యి సేకరణకు 7 విడతలుగా టెండర్లను నిర్వహించారు. ఈ పారదర్శక ప్రక్రియలో 7 ప్రముఖ డైరీ సంస్థలు పాల్గొనగా, వాటికి దక్కిన టెండర్ల వివరాలు ఇలా ఉన్నాయి: 1. నందిని (ఐఓఈ) – 4 టెండర్లు దక్కించుకుంది. 2. మదర్ డైరీ – 2 టెండర్లు దక్కించుకుంది. 3. ఇందాపూర్ డైరీ – 2 టెండర్లు దక్కించుకుంది. 4. సంగం డైరీ – 1 టెండర్ దక్కించుకుంది. 5. ప్రీమియర్ అగ్రి డైరీ – టెండర్ దక్కించుకోలేదు. 6. కొల్హాపూర్ డైరీ (గోకుల్) – టెండర్ దక్కించుకోలేదు. 7. గోవింద్ మిల్క్ – టెండర్ దక్కించుకోలేదుఈ మార్పుల ద్వారా భక్తులకు అత్యంత స్వచ్ఛమైన, నాణ్యమైన లడ్డూ ప్రసాదాన్ని అందించడమే తమ ప్రథమ కర్తవ్యమని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా ద్వారా ఓ అధికారిక పత్రికా ప్రకటనను విడుదల చేశారు.

## చిన్నారులకు పండ్లు పంపిణీ

కమాన్ పూర్: కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగన్వాడి సెంటర్లలో శివసేన సమితి అధ్యక్షుడు గన్నెవరపు రవి ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు.కమాన్ పూర్ శివసేన సేవాసమితి అధ్యక్షులు గన్నెవరపు రవి ఆధ్వర్యంలో గురువారం ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. కమాన్ పూర్ మండలంలోని సిద్ధిపల్లెలో గల ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వక్తలు ఛత్రపతి శివాజీ పోరాటం.. ఆయన విశిష్టత గురించి వివరించారు. అనంతరం కమాన్ పూర్ మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రంలోని చిన్నారులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గజ్జెల శేఖర్ ఆర్ఎస్ఎస్ జిల్లా శారీరక ప్రముఖ హాజరైనారు. అలాగే ఈ కార్యక్రమంలో శివసేన సేవా సమితి అధ్యక్షులు గన్నవరపు రవి ఉపాధ్యక్షులు బిల్లా వెంకటేశ్వర్లు సుద్దాల కృష్ణమూర్తి దేవుని ఉరి చంద్రమౌళి గర్రెపల్లి సత్యం మానుక ఓదెలు జమాల్పూర్ శ్యామలాల్ ఏరువా సత్య రామ్ రాసకొండ సమ్మయ్య తడగొండ శ్రీను మట్ట మల్లేష్ పొరగంటి పోశాలు చెరుకు చందు తాటికొండ హరీష్ మేకల శ్రీనివాస్ కుందారపు మహేష్ కాస రవి మడ్డి సాయి తాటికొండ శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

# బెజవాడ కార్పొరేషన్ పై ఆశకిరణ్ గురి




విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వంగవీటి కుటుంబానికి కాస్త ప్రత్యేక స్థానం ఉంటుంది. దివంగత వంగవీటి రంగా రాజకీయ వారసత్వం పై ఎప్పుడు ఏదో ఒక చర్చ మనం చూస్తూనే ఉంటాం. వంగవీటి రంగా కుమారుడు వంగవీటి రాధా రాజకీయాల్లో ఉన్నప్పటికీ, ఆయన పెద్దగా యాక్టివ్ గా లేరు.. అనే ఆవేదన రంగ అభిమానుల్లో కనపడుతూ ఉంటుంది. ఇక ఇప్పుడు రంగా కుటుంబం నుంచి ఆయన కుమార్తె ఆశ కిరణ్ రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. ఏ పార్టీలో చేరకపోయినప్పటికీ, ప్రజల్లో ఉంటానంటూ ఆమె చేసిన ప్రకటనలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరిగింది. ఆమెకు తెలుగుదేశం( పార్టీ లేదా జనసేన పార్టీలు ఆహ్వానం పలుకుతున్నాయని వార్తలు కూడా వచ్చాయి.అయితే ఇప్పుడు మరో వార్త బెజవాడ రాజకీయాల్లో సంచలనంగా మారింది. వంగవీటి ఆశ కిరణ్, విజయవాడ మేయర్ అయ్యే అవకాశాలు ఉండొచ్చు ప్రచారం మొదలైంది. గత కార్పొరేషన్ ఎన్నికల్లో మహిళను అప్పటి వైసిపి ప్రభుత్వం మేయర్ గా ఎంపిక చేసింది. ఇప్పుడు అదే సాంప్రదాయాన్ని కొనసాగిస్తూ, కూటమి కూడా మహిళా నాయకురాలిని మేయర్ గా ఎంపిక చేసే అవకాశం ఉండవచ్చు. త్వరలోనే ఆమె జనసేన లేదా టిడిపిలో జాయిన్ అయ్యే అవకాశం ఉండవచ్చని.. ఈ ఏడాది చివర్లో జరగబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ఆమె కార్పొరేటర్ గా నిలబడే అవకాశాలు ఉండవచ్చును అంటూ హడావుడి మొదలైందికాపు సామాజిక వర్గ ఓటు బ్యాంకు చీలకుండా, కూటమి ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటుంది. జనసేన రూపంలో మెజారిటీ కాపు సామాజిక వర్గం కూటమి వైపు ఉండగా.. వంగవీటి కుటుంబం ద్వారా కొంత కాపు సామాజిక వర్గాన్ని తమ వైపుకు తిప్పుకోవాలని వైయస్ జగన్ భావిస్తున్నారు. అందుకే ఇప్పుడు వంగవీటి ఆశా కిరణ్ ద్వారా.. కాపు సామాజిక వర్గంలో చీలిక తీసుకురాకుండా ఉండే దిశగా అడుగులు పడుతున్నాయి. త్వరలోనే వంగవీటి రాధకు ఎమ్మెల్సీ లేదా రాజ్యసభ ఇచ్చే అవకాశం కూడా ఉంది. ఇక ఇదే సమయంలో వంగవీటి రంగా కుమార్తెకు కూడా విజయవాడ మేయర్ పదవిని ఖరారు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఉండకపోవచ్చు. దీనిపై ఇప్పటికే కూటమి పెద్దలు నిర్ణయం తీసుకున్నట్లుగా కూడా సమాచారం.

# శాల పల్లె లో శివాజీ విగ్రహ ఆవిష్కరణ



కమాన్ పూర్ : కమాన్ పూర్ మండలం సిద్ది పల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని శాల పల్లెలో చత్రపతి శివాజీ విగ్రహాన్ని గురువారం ఆవిష్కరించారు. గ్రామపంచాయతీలో శాలపల్లె హనుమాన్ యూత్ వారి ఆధ్వర్యంలో శ్రీ మహారాజ చత్రపతి శివాజీ విగ్రహం ఆవిష్కరణ ఘనంగా అంగరంగ వైభవంగా ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బంగారం కళ్యాణి మహేష్, ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్, గడ్డం శ్రీనివాస్, చిప్ప రాజ్‌కుమార్, బిల్లా వెంకటేష్, యూత్ సభ్యులు బిల్లా హరీష్, తాటికొండ హరీష్,కుందారపు మహేష్, మాటేటి అనిల్,చిప్ప అంజి, మాటేటి కుమార్ స్వామి, తాటికొండ సందీప్, తాటికొండ ప్రశాంత్, మాటేటి రాజ్ కుమార్, తౌటపు సాయి, మోర ప్రశాంత్ గారు తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# రాజోలులో రగులుతున్న జ్వాల

కాకినాడ : అంబేద్కర్ కోనసీమ జిల్లాలో రాజోలు అనగానే ఓ ప్రత్యేకత ఉంటుంది. జనసేన పార్టీ నుంచి వరుసగా రెండు సార్లు ఎమ్మెల్యే గెలిచిన నియోజకవర్గం అది. అదికూడా జనసేన పార్టీకి మొట్టమొదటి ఎమ్మెల్యేను గెలిపించి శుభారంభం ఇచ్చిన నియోజకవర్గం. ఈ నియోజకవర్గం అందుకే అంత ప్రత్యేకం. ఇదే విషయాన్ని ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ కూడా చాలా సందర్భాల్లో ప్రస్తావించారు. రాజోలు ఒక చిరుదివ్వె లాంటిదని కూడా ఆయన ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే ఈ నియోజకవర్గంలో మాత్రం జనసేన ఎమ్మెల్యే పనితీరుపై ఆ పార్టీలోనే అసంతృప్తి జ్వాలలు రేగుతోన్నాయా అన్న ప్రశ్నకు అవుననే సమాధానం ఆపార్టీ నాయకుల నుంచే వినిపిస్తోంది. ఇదిలా ఉంటే ఇదే నియోజకవర్గంలో టీడీపీ తన ఉనికిని కాపాడుకునేందుకు కూడా భారీ స్థాయిలో ప్రయత్నిస్తోంది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కుమార్తె గొల్లపల్లి అమూల్యను టీడీపీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా నియమించింది. దీంతో రాజోలులో టీడీపీలో కొత్త జోష్ నెలకొంది. కూటమి ప్రభుత్వంలో ఏ కార్యక్రమానికైనా టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులకు సమాచారం ఇవ్వాల్సిన పరిస్థితి ఉంటుంది. అయితే రాజోలు నియోజకవర్గంలో మాత్రం టీడీపీ ఇంచార్జ్‌గా ఉన్న అమూల్యకు చాలా ప్రభుత్వ కార్యక్రమాలకు అసలు సమాచారం ఇవ్వడం లేదన్నది ఆమె తన అనుచరుల వద్ద వాపోతున్నారట. ఇదే విషయాన్ని పార్టీ అధిష్టానానికి కూడా తెలిపినట్లు తెలుస్తోంది. నియోకవర్గాల్లో పలు నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ కూడా కనీస సమాచారం ఇవ్వకుండా తనకు నచ్చిన వారినే నియమించుకుంటున్నారని, వారి పార్టీ వరకు పరవాలేదు కానీ టీడీపీ నుంచి నియమించిన వారి విషయంలో కూడా తన వ్యతిరేకులకు కట్టబెట్టి తనకు వ్యతిరేక వర్గాన్ని పెంచి పోషిస్తున్నారని అమూల్య వాదనగా తెలుస్తోంది. ఉదాహరణకు ఇటీవలే ఇచ్చిన అంతర్వేది ఆలయ కమిటీ ఛైర్మన్ విషయంలోనూ ఇదే జరిగిందన్నది అమూల్య వర్గీయుల వాదనగా వినిపిస్తోంది. అంతర్వేది లక్ష్మి నరసింహస్వామి ఆలయ కమిటీ ఛైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇచ్చామని ఎమ్మెల్యే దేవవరప్రసాదరావు చెబుతున్నా ఈ సమాచారం తనకు చెప్పలేదని, తాను ప్రతిపాదించిన పేరు వేరే నాయకుడిది కాగా వారికి అనుకూలమైన వారికే పదవి కట్టబెట్టారన్నది అమూల్య మాటగా చెబుతున్నారు ఆమె అనుచరులు.

ఇదే కాకుండా నియోజకవర్గంలో నియమించిన పలు నామినేటెడ్ పోస్టుల్లో టీడీపీకి ఇవ్వాల్సిన పదవుల్లో కూడా తన జోక్యం లేకుండా చేస్తున్నారని, నియోజకవర్గంలో అసలు ఒక ఇంచార్జ్ ఉన్నారన్న విషయాన్ని కూడా ఎమ్మెల్యే పట్టించుకోవడంలేదని అమూల్య బాధపడుతున్నట్టు తెలుస్తోంది.ప్రస్తుత పరిస్థితుల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం వహిస్తోన్న నియోజకవర్గాల్లో టీడీపీ అధిష్టానం కూడా జోక్యం చేసుకుంటున్న సందర్భాలు చాలా తక్కువనే చెబుతున్నారు విశ్లేషకులు. ఇదే విషయం రాజోలు నియోజకవర్గంలో కూడా వర్తిస్తుందంటున్నారు. అందులోనూ జనసేన అధినేతకు రాజోలు నియోజకవర్గం అంటే మరింత ప్రత్యేకం కాగా ఇక్కడ ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తోన్న దేవ వరప్రసాదరావు మాజీ ఐఏఎస్ అధికారి కావడం, ఆయనకు అధినేతతో అత్యంత సాన్నిహిత్యం ఉండడం ఆయన మాటే వేదం అవుతుందంటున్నారు. ఈ పరిస్థితుల్లో అంతర్గతంగా జనసేన, టీడీపీ నేతల మధ్య అసంతృప్తి పరిస్థితులున్నా కూడా అవేమీ ఇరు పార్టీ నాయకత్వాలు పట్టించుకునే పరిస్థితి ఉండదని, లైట్ తీసుకుంటున్నాయంటున్నారు.ఇదిలా ఉంటే జనసేన పార్టీలోనే ఎమ్మెల్యేపై అసంతృప్తి జ్వాలలు కనిపిస్తున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటికే రెండు వర్గాలుగా అంతర్గత యుద్ధాలే జరుగుతున్నాయి.. అవి ఎంతలా అంటే సోషల్ మీడియా వేదికగా కూడా ఒకరిపై మరొకరు దుమ్మెత్తిపోసుకునేంత స్థాయిలో అంతర్గత విభేధాలు భగ్గుమంటుండగా కొందరైతే బాహాటంగా ఎమ్మెల్యే పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

దీనికి తోడు ఇటీవల కాలంలో వైసీపీకకు చెందిన కొందరు జనసేన పార్టీలో దూరి ఎమ్మెల్యే అనుచరులుగా చక్రం తిప్పడం ముందు నుంచి పార్టీ జెండా మోసిన నాయకులు, కార్యకర్తలకు అసలు మింగుడు పడని అంశంగా మారింది. దీంతో ఎమ్మెల్యే తీరుపై కూడా కొందరు అధిష్టానానికి ఇప్పటికే ఫిర్యాదులు చేసినట్లు తెలుస్తోంది. జనసేన పార్టీలో అంతర్గత పోరు విషయం ఇలా ఉంటే ఇక టీడీపీలో కూడా రెండు వర్గాలుగా మాటల యుద్ధం సాగుతోంది. ఇంచార్జ్ అమూల్యపై బాహాటంగానే విమర్శలు గుప్పిస్తున్నారు ఆ పార్టీలోనే కొందరు నేతలు. అమూల్య ఒంటెద్దు పోకడలతో కొందరినిమాత్రమే వెంటేసుకుని వెళ్తున్నారని ఆరోపిస్తున్నారు. మొత్తం మీద రాజోలు నియోజకవర్గంలో అటు జనసేన, ఇటు టీడీపీలో అంతర్గత కోల్డ్ వార్ అయితే జరుగుతోందంటున్నారు.

# 122 ఏండ్ల తర్వాత తెరుచుకోనున్న 'కోణార్క్' గర్భ గుడి



కోణార్క్:ఒడిశాలోని 13వ శతాబ్దపు కోణార్క్ సూర్య దేవాలయ గర్భ గుడిలోకి త్వరలో భక్తులు ప్రవేశించే అవకాశం రానున్నది. ప్రస్తుతం ఆ స్థలం ఇసుకతో నిండి ఉంది. దాన్ని ఇప్పుడు తొలగిస్తున్నారు. ఆలయం వెనుక ఉన్న 15 అడుగుల ఎత్తయిన గోడ కూలిపోకుండా నిరోధించడానికి బ్రిటిష్ పాలకులు 1903–04లో గర్భ గుడిని వేల టన్నుల ఇసుకతో నింపారు. జగ్‌మోహన్ హాల్‌గా పిలిచే ఈ ప్రాంతంలోకి శతాబ్దం పాటు ఎవరూ ప్రవేశించలేదు. తాజాగా భారత పురావస్తు శాఖ, ఐఐటీ మద్రాస్ నిపుణులతో కూడిన బృందం ఈ ఇసుకను తొలగించే పని చేపట్టింది. మొత్తం ఇసుకను తరలించడానికి మూడు నెలలు పడుతుందని ఓ పురావస్తు శాఖ అధికారి తెలిపారు. ఇసుకను తరలించిన తర్వాత లోపలి గోడల పటిష్ఠతను పరిశీలించి గుడి పునర్ నిర్మాణంపై ఓ నిర్ణయం తీసుకోనున్నారు.

# అప్పులే ఆధారం!




నగరాలు అంబరాన్నంటుతాయని ఊరించి, అప్పుల కుప్పలుగా మార్చేదే అర్బన్ ఛాలెంజ్ ఫండ్. నగరాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్ది, వాటిని వర్తమాన అవసరాలకు తగినట్టు పునర్నిర్మిస్తామంటూ కేంద్రం ప్రకటించిన ఈ పథకం ప్రజలపై భారాలు వేసే ప్రపంచబ్యాంకు ఆదేశిత కార్యక్రమమే. నగరాలను, పట్టణాలను మరింత బలహీనంగా, రుణగ్రస్థంగా పౌరసేవలన్నిటికీ యూజర్ ఛార్జీలు తప్పనిసరి చేసే కుట్ర ఇది. నగరాలను ఆర్థిక వృద్ధి కేంద్రాలుగా తీర్చిదిద్ది వాటిని వర్తమాన అవసరాలకు తగినట్టు పునర్నిర్మించడానికి లక్ష కోట్ల రూపాయల అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌ను తీసుకొచ్చినట్టు కేంద్రం ఘనంగా ప్రకటించింది. ఈ కొత్త పథకం కాలపరిమితి 2030–31 వరకూ ఉంటుంది. దీనికింద ఎంపిక చేసిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి 2033–34 వరకూ గడువు ఇస్తారు. నాలుగు లక్షల కోట్ల ఈ ప్రాజెక్టులో రాష్ట్రాలు 25 శాతం వాటాగా లక్ష కోట్లు సర్దుబాటు చేయాలి. బాండ్లు, రుణాలు, ప్రభుత్వ -- ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ఆధారంగా మరో రెండు లక్షల కోట్లు నగరాలు సమకూర్చుకోవాల్సి ఉంది. గతంలో స్మార్ట్ సిటీల మాదిరిగానే మౌలిక వసతులు, తాగునీరు, పారిశుధ్య వ్యవస్థను తీర్చిదిద్దేందుకు రాష్ట్రాలు ఉపయోగించుకోవచ్చని, ఇప్పటివరకూ గ్రాంట్లపై ఆధారపడుతున్న పట్టణాభివృద్ధి... ఇక నుంచి మార్కెట్, సంస్కరణల ఆధారంగా మారుతుందని కేంద్రం చెబుతోంది. సంక్షేమ పథకాల అమలుకే అవస్థ పడుతున్న రాష్ట్రాలపై కొత్తగా తీసుకొచ్చిన విబి గ్రామ్ జి పథకం సహా అనేక భారాలు మోపి, నగరాల అభివృద్ధికి ఇవ్వాల్సిన గ్రాంట్లకు కోతపెట్టి, ఇప్పుడు 25 శాతం వాటా భరించమనడం అసమంజసం. నగరాలు, పట్టణాలు సమకూర్చు కున్న 50 శాతం నిధులు తిరిగి చెల్లించడానికి యూజర్ ఛార్జీలు, రోడ్ ట్యాక్స్‌లు... తదితర రూపాల్లో ప్రజలపై భారాలు వేయడం అనివార్యం. గతంలో అమలైన జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్ (జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం) 2015లో మోడీ ప్రభుత్వ హయాంలో స్మార్ట్ సిటీస్ మిషన్ (ఎస్‌సిఎం)గా రూపాంతరం చెందింది. విమానాశ్రయాలు, భారీ రహదారులు, ఇతర కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌తో సంబంధం కలిగిన కొత్త సిలికాన్ వ్యాలీలుగా ఐదేళ్లలో వంద నగరాలను తీర్చిదిద్దుతామన్న కేంద్రం ప్రకటనలను గోడీ మీడియా ఊదరగొట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) ఆధారంగా ప్రవేశపెట్టిన ఈ మిషన్‌తో ప్రైవేటు సంస్థలకు ఈక్విటీ భాగస్వామ్యం కల్పించడంతోపాటు యూజర్ ఛార్జీలు విధించే హక్కు కూడా ఇచ్చారు. ఇంతచేసినా...పదేళ్లు దాటినా... 18 నగరాల్లోని ప్రాజెక్టులే పూర్తయ్యాయని లెక్కలు చెబుతున్నాయి. స్మార్ట్ సిటీల్లో ఒకటి, బిజెపి పాలిత మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో తాగునీటి కాలుష్యంతో పదుల సంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన ఉదంతం వీటిలోనిడొల్ల తనానికి నిదర్శనం. అమృత్, స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 వంటి మార్కెట్ ఆధారిత పథకాలు లక్ష్యాలు సాధించిన దాఖలాల్లేవు. కేంద్రం పబ్లిక్ సపోర్ట్ కోసం ఇవ్వాల్సిన వాటాను 2014 నుంచి గణనీయంగా తగ్గించి, ప్రైవేట్ ఫైనాన్స్‌పై ఆధారపడేలా ఒత్తిడి చేస్తోంది. ఇప్పటికే యూనివర్సిటీలు అప్పుల ఊబిలో కూరుకు పోయాయి. ఫీజుల పెంపు పేద విద్యార్థులకు ఉన్నతవిద్యను మరింత దూరం చేస్తోంది. నిధుల కొరతతో ప్రభుత్వ వైద్యరంగం క్షీణిస్తుండగా... ఆరోగ్యశ్రీ లాంటి పథకాలు కార్పొరేట్, ప్రైవేటు వైద్యరంగానికి భారీగా నిధులు సమకూరుస్తున్నాయి. విద్యుత్ రంగ ప్రైవేటీకరణను చూస్తున్నాం. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోణం లో కాకుండా... ప్రైవేటు, కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా కేంద్రం షరతులు పెట్టడం అత్యంత ప్రమాదకరం. నగరాలు, పట్టణా లు అప్పుల ఊబిలో కూరుకుపోయి, కార్పొరేట్ హస్తగతం కావడానికి మినహా ప్రజలకు ఉపయోగపడేలా అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లేదు. పౌర సేవలన్నింటినీ కొనుక్కోవలసిన దుస్థితిని తెచ్చే ఈ పథకాన్ని ప్రజలు వ్యతిరేకించాలి. అందుకు విశాల ఐక్య ఉద్యమాలే మార్గం.

## రెండుగా పాకిస్తాన్

లాహోరం, : మన పొరుగు దేశం పాకిస్తాన్ మళ్లీ రెండు ముక్కలు కాబో తోందా అంటే అవుననే అంటున్నారు పరిశీలకులు. దశాబ్దాలుగా పాకిస్తాన్ నుంచి విభజన పోరాటం చేస్తున్న బలూచిస్తాన్.. పాకిస్తాన్ నుంచి విడిపోవడం దాదాపు ఖాయం అయినట్లు తెలుస్తోంది. ఇటీవల పాకిస్తాన్ మంత్రి చట్టసభలో మనము.. వాళ్లు అని చెప్పడం 1971 బంగ్లాదేశ్ విడిపోయినప్పుడు వాడిన పదాలను గుర్తు చేస్తోంది. ఈ పరిణామాలు బలూచ్ స్వాతంత్ర్య ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయి. బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) 1 నిమిషం 10 సెకన్ల వీడియోలో పాకిస్తాన్ సైనికులు జీమిల్, షమ్షుబ్రేజ్‌లను చూపించింది. వీరిని 7 రోజుల్లో విడుదల చేయకపోతే చంపేస్తామని హెచ్చరించారు. 5 వేల అత్యాధునిక డ్రోన్లతో ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్‌పై దాడులు చేస్తున్నారు. ఇప్పటివరకు 1,184 మంది పాక్ సైనికులు మరణించారు. బలూచిస్తాన్ సీఎం అక్తర్ మెంగల్ 15 రోజుల క్రితం రాజీనామా చేసి, 'ఇక పాకిస్తాన్‌లో ఉండదు' అని ప్రకటించారు. 1947లో ఖాన్ ఆఫ్ కలాట్‌తో ఒప్పందం ఉల్లంఘించి, 1950లో బలూచిస్తాన్‌ను బలవంతంగా కలిపారు. 1958లో నవాబ్ నవరోజ్ ఖాన్ తిరుగుబాటు చేసి అరెస్టు చేయబడ్డాడు. 2006లో నవాబ్ అక్బర్ బుగ్తి హత్యకు దారి తీసింది. ఇలా పాకిస్తాన్ బలూచిస్తాన్‌ను మోసంచేసింది. దీంతో బలూచ్ ప్రజలు పాకిస్తాన్‌ను విశ్వసించడం లేదు. 2002లో చైనా?పాక్ ఆర్థిక మార్గం (సీపీఈసీ) ప్రకటించడం బలూచ్‌లలో కోపాన్ని మేల్కొలిపింది. ఇప్పుడు బీఎల్ఏ ఆపరేషన్ హెరాఫ్ 2.0లో భారత సరిహద్దు యాంటీ?డ్రోన్ టెక్నాలజీతో దాడి చేస్తోంది. భవిష్యత్‌లో పాకిస్తాన్‌కు తీవ్ర నష్టం జరిగే అవకాశం ఉంది. బలూచ్ నాయకులు 'పాకిస్తాన్ ఆక్రమణ' అని పిలుస్తున్నారు. మెంగల్ 'ప్రభుత్వ అధికారం ఏ ఇంచ్ లేకుండా పోయింది' అన్నారు. ఈ ఘటనలు 1971 బంగ్లాదేశ్ సారాంశాన్ని పునరావృతం చేస్తూ, పాక్‌కు కీలక సవాలుగా మారాయి.

## మండల స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షలో ఆరెంద ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రతిభ




మంథని : మంథని మండలంలో నిర్వహించిన మండల స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పరీక్షకు మండలంలోని అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల్లో శాస్త్ర విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించడం, ప్రతిభావంతులను గుర్తించడం లక్ష్యంగా ఈ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షలో ఆరెంద ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి (ఇంగ్లీష్ మీడియం) చదువుతున్న తిప్పని ఆకాశ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. మొత్తం 50 మార్కులకు గాను 44 మార్కులు సాధించి మండల స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చాడు. ఆకాశ్ సాధించిన విజయంపై పాఠశాల హెచ్‌ఎం ఈదులపల్లి నరసింహారావు, ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. మండల స్థాయిలో మొదటి స్థానం సాధించిన నేపథ్యంలో ఈ నెల 23న జరగనున్న జిల్లా స్థాయి భౌతిక శాస్త్ర ప్రతిభా పోటీలకు ఆకాశ్ ఎంపికయ్యాడు. జిల్లా స్థాయి పోటీల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించేలా భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు పద్మజ ప్రత్యేక శిక్షణ అందిస్తున్నారు. పరీక్షలకు అవసరమైన సిలబస్, మోడల్ ప్రశ్నలు, సమస్య పరిష్కార విధానాలపై ప్రత్యేకంగా దృష్టి సారించి ప్రిపరేషన్ కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం నరసింహా రావు ఆకాశ్‌కు గురువారం ఆర్థిక సహాయం అందించి మరింత ప్రోత్సహించారు. విద్యార్థి పట్టుదలతో చదువుకుంటే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఉపాధ్యాయులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీలత, సువార్త, గియశోద్దిన్, వోడ్నాల సహేందర్, మమత, శ్రీవాణి, శ్రీలత, సీఆర్‌పీ మల్లన్న, అమన్ పాల్గొన్నారు.

# ఎ.ఐ అవకాశాలు.. ఆందోళనలు..

దేశ రాజధాని ఢిల్లీలో జరుగుతున్న 'ఇండియా–ఎ.ఐ ఇంపాక్ట్ సమ్మిట్–2026' సందర్భంగా అనేక కీలకాంశాలు తెరమీదకు వచ్చాయి. భారత్‌ను గ్లోబల్ సౌత్‌కు సాంకేతిక కేంద్రంగా నిలబెట్టాలన్న లక్ష్యంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే, ఆ దిశలో తీసుకుంటున్న చర్యలే ప్రశ్నార్థకంగా మారాయి. అంతర్జాతీయ స్థాయిలో నాయకత్వం వహించే సంగతి అలా ఉంచితే ప్రపంచ స్థాయికి సరితూగే లేదా దగ్గరగా ఉన్న పునాది స్థాయి వ్యవస్థ (ఫౌండేషన్ మోడల్) కూడా మన దగ్గర లేదు. ఈ రంగంలో ఇప్పటికే నాయకత్వం వహిస్తూ ప్రపంచానికి దిశా నిర్దేశం చేస్తున్న అమెరికా, చైనాలు పెద్ద ఎత్తున నైపుణ్యాలను, పరిశోధనలను విస్తృతం చేస్తుండగా, మనం ఏం చేయాలి, ఎలా చేయాలి అన్న దాని దగ్గరే నిలబడిపోయాం. ప్రాథమిక స్థాయి వ్యవస్థను పూర్తి స్థాయిలో స్వదేశీ పునాదిమీద ఏర్పాటు చేసుకోవడం భవిష్యత్తులో అన్ని విధాల మేలు చేస్తుందని నిపుణులు సూచిస్తున్నారు. అయితే, అన్ని అంశాలకు అమెరికా వైపు చూసే నరేంద్రమోడీ ప్రభుత్వం ఆ దిశలో చర్యలు తీసుకోవడం అనుమానమే! అట్టహాసంగా నిర్వహిస్తున్న ఎఐ సదస్సులో ఇప్పటి వరకు అటువంటి ప్రకటన ఏదీ కేంద్ర ప్రభుత్వం నుండి వెలువడకపోవడమే ఈ అనుమానానికి కారణం. ఫౌండేషన్ మోడల్ సంగతి అలా ఉంచితే, లార్జి మోడల్స్ ట్రైనింగ్‌కు అవసరమైన హైపర్ స్కేల్ డేటా సెంటర్లు కూడా అందుబాటులో లేవు. ఇవేవీ లేకుండా గ్లోబల్ లీడర్‌షిప్ గురించి, అప్పుడు వెల్లువెత్తే అవకాశాల గురించి మాట్లాడటం ఆకాశానికి నిచ్చెనలు వేయడమే!

ఇంపాక్ట్ సమ్మిట్ కోసం నీతి ఆయోగ్ రూపొందించిన నివేదిక ప్రకారం ఎఐ రంగంలో మన దేశం పూర్తిస్థాయిలో సన్నద్ధం కావడానికి మరో పది నుండి ఇరవై ఏళ్లు పడతాయట! ఒక వార్తా సంస్థకు ఇచ్చిన 'ప్రత్యేక' ఇంటర్వ్యూలో 2047 నాటికి ఎఐ రంగంలో భారత్‌ను సూపర్ పవర్‌గా నిలపనున్నట్లు ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. 'కేవలం ఎఐ వినియోగదారునిగా కాకుండా ఎఐ సృష్టికర్తగా, ఎఐ విప్లవంలో భాగస్వామి దశ నుండి దానిని శాసించే స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దుతున్నాం' అని మోడీ అన్నారు. ఈ మాటలు ఎలా ఉన్నప్పటికీ శాస్త్ర సాంకేతిక రంగాల్లో శరవేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత తరుణంలో అప్పటికి పరిస్థితులు ఎలా ఉంటాయో,





ఏ కొత్త సాంకేతికత ఉనికిలోకి వస్తుందో తెలియదు! మరోవైపు ప్రపంచంలో ఎఐ అభివృద్ధి విస్ఫోటనం చెందుతోంది. శక్తివంతమైన నమూనాలకు శిక్షణ ఇచ్చే కంప్యూటింగ్ శరవేగంగా పెరుగుతోంది. ప్రత్యేకమైన చిప్‌ల తయారీ కోసం పెద్దఎత్తున పోటీ జరుగుతోంది, భారీ టెక్ సంస్థలు ఎఐలోకి పెద్ద మొత్తాలను కుమ్మరిస్తున్నాయి. 2024 నుండి అమెరికా,చైనాలు ఈ రంగంపై దృష్టి సారించి భారీ మొత్తంలో ఖర్చు చేస్తుండగా, మన దేశంలో మోడీ సర్కారు ఈ రంగ అభివృద్ధి కోసం ఎంత ఖర్చు చేయనుందన్న విషయంలో ఇప్పటి వరకు స్పష్టత లేదు. మరోవైపు ఎఐ వద్ధి పేరుతో వ్యక్తిగత గోప్యతకు ముప్పు తలెత్తే ప్రమాదం ఉంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై ప్రభావం పడనుంది. న్యాయవ్యవస్థలో కూడా ఎఐ వినియోగంపై జాగ్రత్త అవసరమని ఇటీవల సుప్రీంకోర్టు సూచించింది. ఆరోగ్య రంగంలోనూ ఇటువంటి ఆందోళనలే వ్యక్తమవుతున్నాయి. మీడియా, రాజకీయ రంగాల్లో డీప్‌ఫేక్‌ల భయాలు ఇప్పటికే ప్రారంభమైనాయి. పెద్ద టెక్ సంస్థల ఆధిపత్యం పెరిగితే డేటా, మౌలిక వసతులు వారి చేతుల్లోనే కేంద్రీకృతమయ్యే ప్రమాదంఉంది. వీటన్నింటిని దృష్టిలో ఉంచుకుని బలమైన పారదర్శక చట్టాలు, డేటా రక్షణ, నైతిక నియంత్రణ, సమగ్ర శిక్షణ విధానాలను అందరితో చర్చించి పారదర్శకంగా రూపొందించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. అదేవిధంగా దేశంలో ఉన్న యువశక్తిని సమర్థవంతంగా వినియోగిం చుకోవడంతో పాటు, డేటా సెంటర్లు, ఫౌండేషన్ మోడల్స్, చిప్ తయారీ వంటి అంశాలపై దృష్టి సారించాలి. ఢిల్లీ ఎఐ సదస్సులో చోటుచేసుకున్నసాంకేతిక లోపాలతో పాటు, మేడ్ ఇన్ చైనా రోబోడాగ్‌ను తమ సొంత ఆవిష్కరణగా ప్రకటించుకుని నగుబాటైన గల్గోటియాస్‌యూనివర్శిటీ అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్టను మసకబార్చాయి. భవిష్యత్తులో ఇటువంటివి జరగకుండా చూడాలి.

# వేగంగా కాశీబుగ్గ ఫ్లైఓవర్ పనులు



శ్రీకాకుళం, : శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులలో వేగం పెరిగింది. కాశీబుగ్గ పైవంతెన పనులను ఏప్రిల్ నెలకల్లా పూర్తిచేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. ఫ్లైఓవర్ నిర్మాణ పనులను రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. అనంతరం పలాస ఆర్వోబీ పనులు, కేంద్రీయ విద్యాలయం పనుల పురోగతిని రామ్మోహన్ నాయుడు పరిశీలించారు. ఈ వివరాలను ఎక్స్ వేదికగా పంచుకున్నారు. ఏపీలో కొత్త ఫ్లైఓవర్ త్వరలోనే అందుబాటులోకి రానుంది. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణాన్ని ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తెలిపారు. కాశీబుగ్గ ఫ్లైఓవర్ ఏప్రిల్ నాటికి పూర్తవుతాయని వెల్లడించారు. పలాస రైల్వే పైవంతెన, కేంద్రీయ విద్యాలయం పనులు జరుగుతున్న తీరును రామ్మోహన్ నాయుడు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి రామ్మోహన్ నాయుడు.. కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఏళ్లతరబడి సాగుతూ వచ్చాయన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చాక దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకున్నట్లు వివరించారు. కేంద్రీయ విద్యాలయంలోనూ వచ్చే ఏడాది నుంచి తాత్కాలికంగా తరగతులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. పలాస ప్రజల ఎన్నో ఏళ్ల కల అయిన పలాస ఆర్వోబీ ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకోవడం ఆనందంగా ఉందని.. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే దీనికి అత్యున్నత ప్రాధాన్యం ఇచ్చామన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న పనులను కూడా తిరిగి ప్రారంభించామని.. భారతీయ రైల్వే, జిల్లా యంత్రాంగం సమన్వయంతో నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని రామ్మోహన్ నాయుడు వివరించారు. ప్రజలకు త్వరగా అందుబాటులోకి రావడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. పలాసా ఆర్వోబీ నిర్మాణం పూర్తి అయితే పలాస పట్టణంలో ట్రాఫిక్ రద్దీ తగ్గి ప్రయాణికులకు సౌకర్యవంతమైన రాకపోకలకు వీలు కలుగుతుందని వివరించారు. పలాసలో ఏర్పాటు చేయనున్న కేంద్రియ విద్యాలయం ద్వారా సాయుధ దళాల సిబ్బంది, కేంద్ర సంస్థల ఉద్యోగుల పిల్లలకు నాణ్యమైన విద్యా అవకాశాలు లభిస్తాయని వివరించారు. మరోవైపు కాశీబుగ్గ లెవల్ క్రాసింగ్ గేటు వద్ద ట్రాఫిక్ సమస్యలు ఎప్పటి నుంచో వేధిస్తున్నాయి.

ప్రతి పది అరగంటకూ గేట్లు పడుతూ ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. దీంతో ఇక్కడ ఫ్లైఓవర్ నిర్మించాలని నిర్ణయించారు. 2009లో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే వివిధ కారణాలతో నిర్మాణ పనులకు అంతరాయం కలుగుతూ వచ్చింది.

భూసేకరణ, నిర్వాసితులకు పరిహారం వంటి అంశాల కారణంగా నిర్మాణంలో జాప్యం జరుగుతోంది. ఈ పరిస్థితులలో టీడీపీ కూటమి సర్కారు ప్రత్యేక దృష్టి సారించడంతో నిర్మాణ పనులలో వేగం పెరిగింది. తాజాగా ఏప్రిల్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి రామ్మోహన్ నాయుడు ప్రకటించారు

# సివిల్ సర్వెంట్స్... ఖద్దరు చొక్కా బాగ్యం లేదా...?

హైదరాబాద్,: సివిల్ సర్వీసెస్.. దేశంలోనే అత్యున్నత స్థాయి బాధ్యత. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా వీరు వ్యవస్థను శాసిస్తారు, ఫైళ్ల మీద సంతకాలతో వేలమంది జీవితాలను మారుస్తారు. కానీ, అదే అధికారులు ఖాకీ లేదా తెల్ల చొక్కా వదిలేసి ఖద్దరు చొక్కా కట్టుకోగానే సీన్ రివర్స్ అవుతోంది. తాజాగా మాజీ ఐపీఎస్ అధికారి వీవీ లక్ష్మినారాయణ ప్రత్యక్ష రాజకీయాలకు స్వస్తి పలికి, ప్రైవేటు సంస్థలో చేరడం తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. అటు జయప్రకాశ్ నారాయణ నుంచి ఇటు లక్ష్మినారాయణ వరకు.. వీరి ప్రయాణాలు ఒకే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయి. సిస్టమ్‌ను బయట ఉండి మార్చడం వేరు, సిస్టమ్‌లో భాగంగా మారి రాజకీయ రొంపిలో నెగ్గకురావడం వేరు అని రుజువు చేస్తున్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక వెలుగు వెలిగిన ఐఏఎస్ అధికారి డాక్టర్ జయప్రకాశ్ నారాయణ. 'లోక్ సత్తా' అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా పాలనా సంస్కరణల కోసం పోరాడి, ఆ తర్వాత దానిని రాజకీయ పార్టీగా మార్చారు. జేపీ రాజకీయాల్లో 'నైతికత' గురించి మాట్లాడారు. కానీ భారతీయ ఓటరు నాడి కేవలం సిద్ధాంతాల మీద మాత్రమే పనిచేయదు. కుల, మత సమీకరణలు, ధన ప్రభావం ఉన్న రాజకీయ క్షేత్రంలో జేపీ మేధోమథనం సామాన్య ఓటరుకు చేరువ కాలేకపోయింది. కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ, అసెంబ్లీలో ఆయన ఒంటరి అయ్యారు. చివరకు రాజకీయాల్లో తన గళం వినిపించే అవకాశం లేదని గ్రహించి, ప్రస్తుతం ఆయన కేవలం సామాజిక విశ్లేషకుడిగానే మిగిలిపోయారు. సీబీఐ మాజీ జేడీగా లక్ష్మినారాయణ పేరు చెబితే అవినీతిపరుల వెన్నులో వణుకు పుట్టేది. ఆ క్రేజ్‌తోనే ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. 2019 ఎన్నికల్లో విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయినప్పటికీ, గణనీయమైన ఓట్లు సాధించారు. కానీ అక్కడితోనే ఆయన గ్రాఫ్ ఆగిపోయింది. ముందుగా జనసేనలో చేరడం, ఆ తర్వాత రాజీనామా చేయడం, మళ్ళీ సొంతంగా జై భారత్ నేషనల్ పార్టీ పెట్టడం.. లాంటివన్నీ ప్రజల్లో అయోమయాన్ని సృష్టించాయి. పోలీసు అధికారిగా కఠినంగా ఉండటం అలవాటైన లక్ష్మినారాయణకు, రాజకీయాల్లో ఉండే అనునిత్యం రాజీపడే తత్వం సెట్ కాలేదు. రాజకీయాల్లో మార్పు తీసుకురావడం కంటే, ప్రైవేటు రంగంలో సేవ చేయడం ఉత్తమమని భావించి ఆయన 'ఈవీ ట్రాన్స్' సంస్థలో బాధ్యతలు చేపట్టారు. ఇది ఆయన రాజకీయ ప్రస్థానానికి దాదాపు ముగింపు పలికినట్టే అని విశ్లేషకులు భావిస్తున్నారు. రాజకీయాల్లోకి వచ్చే ఐఏఎస్, ఐపీఎస్ అధికారుల వైఫల్యానికి ఎన్నో కారణాలున్నాయి. అధికారులుగా ఉన్నప్పుడు వారి మాట శాసనం. అందరూ వారి కింద పని చేస్తారు. కానీ రాజకీయాల్లో 'ప్రజల వద్దకువెళ్లి అడుక్కోవాలి'. ఈ మనస్తత్వ మార్పు అందరికీ సాధ్యం కాదు. సివిల్ సర్వెంట్లు ప్రతిదీ చట్టబద్ధంగా, సిద్ధాంతపరంగా ఉండాలని కోరుకుంటారు. కానీ రాజకీయం అనేది 'గెలుపే లక్ష్యం'గా సాగే చదరంగం. ఇక్కడ ఎథిక్స్ కంటే స్ట్రాటజీలకే ప్రాధాన్యత ఎక్కువ. రాజకీయ పార్టీ నడపాలంటే క్షేత్రస్థాయిలో కార్యకర్తలు ఉండాలి. అధికారులు కేవలం మీడియాలో కనిపించి ఓట్లు రాబట్టలేరు. జేపీ, జేడీ ఇద్దరూ ఈ విషయంలోనే వెనుకబడ్డారు. సివిల్ సర్వెంట్లు రాజకీయాల్లోకి రావడం ప్రజాస్వామ్యానికి మంచిదే అయినా, క్షేత్రస్థాయి వాస్తవాలను గ్రహించకపోతే పరాజయం తప్పదని ఈ ఇద్దరి ఉదాహరణలు నిరూపిస్తున్నాయి. జేపీ మేధస్సు, జేడీ నిజాయితీ రాజకీయ వ్యవస్థకు అవసరమే, కానీ ఆ వ్యవస్థలో ఇమడలేక వారు వెనక్కి వెళ్లడం దురదృష్టకరం. వ్యవస్థను మార్చాలనే తపనతో వచ్చి, చివరకు వ్యవస్థ గాలికి కొట్టుకుపోవడం లేదా పక్కకు తప్పుకోవడం ఒక చేదు నిజం.

# దోమలపై హైటెక్ యుద్ధం



కర్నూలు, : ప్రజారోగ్యానికి పెను సవాల్ విసురుతున్న దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. దోమల నియంత్రణ కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సేవలు ఉపయోగించనుంది. ఏఐ ఆధారంగా పనిచేసే స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ ద్వారా దోమలను కట్టడి చేయాలని భావిస్తోంది. ఇందులో భాగంగా తిరుపతిలో పైలెట్ ప్రాజెక్టు కింద ఈ విధానాన్ని పరిశీలించనున్నారు. అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా మరిన్ని నగరాలకు విస్తరించాలనే ఆలోచనలో ఏపీ ప్రభుత్వం ఉంది. తిరుపతిలో ప్రైవేట్ సంస్థకు ఈ పనులు అప్పగించనున్నారు.దోమలు.. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా.. ప్రతి ఒక్కరినీ వేధిస్తున్న సమస్య. ప్రజారోగ్యానికి ప్రధాన సవాలు విసురుతున్నవి దోమలే.. ఈ నేపథ్యంలో దోమలపై హైటెక్ యుద్ధానికి ఏపీ ప్రభుత్వం సిద్ధమైంది. టెక్నాలజీ సాయంతో దోమలకు చెక్ పెట్టాలని భావిస్తోంది. అందులో భాగంగా కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే స్మార్ట్ దోమల నిఘా వ్యవస్థ (స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్) అందుబాటులోకి తెస్తోంది ఏపీ ప్రభుత్వం. ఆధ్యాత్మిక నగరం తిరుపతిలో తొలుత ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా పరిశీలించనున్నారు. ఇక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్ విస్తరించే ఆలోచనలు చేస్తున్నారు.స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌లో భాగంగా తొలుత ముందుగా నిర్ణయించిన కొన్ని ప్రాంతాలలో ఐవోటీ పరికరాలు ఏర్పాటు చేస్తారు. ఈ పరికరాలు ప్రత్యేకమైన వాసన కలిగి ఉంటాయి. ఫిరమోన్ సాయంతో ఈ ప్రత్యేక వాసన వచ్చేలా అధికారులు వీటిని రూపొందించారు. దీంతో దోమలను ఇవి సులువుగా ఆకర్షిస్తాయి. దీని ద్వారా ఆ ప్రాంతంలో దోమల సాంద్రత ఎలా ఉంది.. అవి ఏ జాతి దోమలు, వాటి లింగం ఏంటనే వివరాలను ఈ ఐవోటీ పరికరాలు గుర్తిస్తాయి. ఈ సమాచారాన్ని వెంటనే సెంట్రల్ డ్యాష్ బోర్డుకు పంపిస్తుంది. ఈ డ్యాష్ బోర్డు.. ఏఐ సాయంతో ఈ వివరాలను విశ్లేషించి.. ఆ ప్రాంతంలో దోమల తీవ్రత ఎలా ఉందనే దానిపై అధికారులను అప్రమత్తం చేస్తుంది. ఆ తర్వాత దోమల నియంత్రణ కోసం డ్రోన్ల సాయంతో మందులను పిచికారీ చేసేలా ప్రణాళికలు రచించారు.మరోపతి తిరుపతిలో దోమలు అధికంగా ఉండే 250 హాట్‌స్పాట్లు గుర్తించారు. వీటిలోని కొన్ని ప్రాంతాలలో జాప్ ట్రాపులు, ఐవోటీ సెన్సార్లు ఏర్పాటు చేయనున్నారు. 20 లక్షలతో నాలుగుచోట్ల ఈ పరికరాలను ఏర్పాటు చేయనున్నారు. అలాగే తిరుపతిలో ఈ పనులను ఓ ప్రైవేట్ సంస్థకు అప్పగించనున్నారు. ఈ నాలుగుచోట్ల వచ్చే ఫలితాల ఆధారంగా తిరుపతి మొత్తం ఈ సేవలు విస్తరించే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఈ స్మార్ట్ మస్కిటో సర్వేలెన్స్ సిస్టమ్‌ను తిరుపతితో పాటుగా విశాఖ, విజయవాడ, కర్నూలు, కాకినాడ, నెల్లూరు, రాజమండ్రి ప్రాంతాల్లో అమలు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉంది.

# అందుబాటులోకి జెన్ జీ కీ బోర్డు

హైదరాబాద్, : ప్రస్తుత కాలంగా డిజిటల్ యుగంగా మారిపోయింది. ఇంటర్నెట్ జీవితాన్ని, పనిని అత్యంత సులభతరం చేసింది. ఇంటి నుండే దూరపు బంధువులతో సంప్రదించడం, మాట్లాడటం సులభమైంది. సాంకేతికత కారణంగా, గంటల సమయం పట్టే పనులు ఇప్పుడు నిమిషాల్లో పూర్తవుతున్నాయి. మొత్తమ్మీద, ప్రస్తుత కాలం డిజిటల్ కమ్యూనికేషన్ యుగం, కానీ సైబర్ మోసాలు, ఆన్‌లైన్ మోసాలు, డిజిటల్ అరెస్టులు వంటి సంఘటనలు ఈ డిజిటల్ కమ్యూనికేషన్‌కు అతిపెద్ద సవాలుగా మారాయి. దీనికి ప్రధాన కారణం అసురక్షిత డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు అంటే అప్లికేషన్‌లను ఉపయోగించడం. విదేశాల నుండి పనిచేసే డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు సురక్షితం కాకపోవడమే పెద్ద సమస్య. అంటే, విదేశీ డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగించడం ద్వారా భారతదేశంలోని సామాన్య ప్రజలు సురక్షితంగా లేరని తాజా నివేదికలు చెబుతున్నాయి. అందువల్ల, ఇది జాతీయ భద్రతకు కూడా ముప్పుగా పరిగణించిందిఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని, అనువాదిని ఏఐ సురక్షితమైన, నమ్మకమైన, పూర్తిగా స్వదేశీ డిజిటల్ ప్లాట్‌ఫామ్ అందుబాటులోకి వచ్చింది. హైప్డ్ సంవాదిని, దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ను అభివృద్ధి చేసింది. వీటిని లాంఛనంగా ప్రారంభించారు., దేశీ ఏఐ జెన్‌జెడ్ కీబోర్డ్ యాప్‌ప్రస్తుతం 80 కోట్లకు పైగా భారత పౌరులు విదేశీయులు నిర్వహిస్తున్న డిజిటల్ కమ్యూనికేషన్ ప్లాట్‌ఫామ్‌లపై ఆధారపడి ఉన్నారు. డేటా భద్రత, గోప్యత, భాషా సమ్మిళితత్వం వంటి సమస్యలు కీలకమయ్యాయి. సురక్షితమైన, స్వదేశీ, గోప్యతపై దృష్టి సారించిన ప్రత్యామ్నాయాల అవసరం గతంలో కంటే ఇప్పుడు మరింత ముఖ్యమైనదిగా మారిపోయాయి.అధిక ప్రచారం పొందుతున్న సంవాదిని గురించి, అనువాదిని ఏఐ సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ మాట్లాడుతూ, ఇది భారతదేశపు మొట్టమొదటి సిమ్–ఆధారిత, బహుభాషా, స్పామ్–రహిత గ్లోబల్ మెసెంజర్ అని అన్నారు. ఈ ప్లాట్‌ఫామ్, డైనమిక్ చాట్ ఐడీల ద్వారా వినియోగదారులు తమ మొబైల్ నంబర్లను పంచుకోకుండానే వ్యక్తిగత చాట్‌లు, గ్రూప్ చాట్‌లు, ఆడియో కాల్‌లు, వీడియో కాల్‌ల ద్వారా సురక్షితంగా సంభాషించుకోవడానికి వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఎండ్–టు–ఎండ్ ఎన్‌క్రిప్షన్, డివైస్–బైండింగ్, అధునాతన యాంటీ–స్పామ్ యంత్రాంగాలు దీనిని సైబర్ నేరాలు, మోసాలు, నకిలీ ఖాతాల నుండి సురక్షితంగా ఉంచుతాయని చంద్రశేఖర్ వెల్లడించారు.అనువాదిని ఏఐ అత్యంత ముఖ్యమైన ఫీచర్ గురించి మాట్లాడుతూ, 22 భారతీయ, 37 విదేశీ భాషలలో రియల్–టైమ్ టెక్స్ట్, వాయిస్ అనువాదాన్ని అందిస్తూ, దేశ భాషా వైవిధ్యాన్ని ఒక శక్తివంతమైన డిజిటల్ వారధిగా మారుస్తుందని సీఈఓ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ వివరించారు. ఇది 'ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్' స్ఫూర్తిని మరింత బలోపేతం చేస్తుందన్నారు. భద్రత కోసం హైప్డ్ సంవాదినిలో వన్–ట్యాప్ SOS అత్యవసర ఫీచర్ కూడా ఉందని, ఇది లైవ్ లొకేషన్‌తో తక్షణ సహాయాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు. ఇది ముఖ్యంగా మహిళలు, విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు, ప్రయాణికులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు.హైప్డ్ సంవాదిని ప్రాంతీయ భాషలలో స్థానిక ఉపాధి, ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్‌షిప్, గిగ్ అవకాశాలను అందిస్తూ, యువతకు వారి సొంత వాతావరణంలోనే అవకాశాలను కల్పిస్తుందని చంద్రశేఖర్ వివరించారు. భాషా అభ్యాస మాడ్యూళ్లు, సామాజిక భాగస్వామ్యం, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ గేమ్‌ల వంటి ఫీచర్లు దీనిని కేవలం సమాచార మార్పిడికి మాధ్యమంగానే కాకుండా, భాగస్వామ్యం, అభివృద్ధికి కూడా ఉపయోగపడే ఒక సమగ్ర డిజిటల్ పర్యావరణ వ్యవస్థగా మారుస్తాయని తెలిపారు.

# రాజకీయామా నీదే పార్టీ

హైదరాబాద్, : తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విచిత్రమైన , ఆసక్తికరమైన సమీకరణాలకు తెరలేపాయి. సిద్ధాంతపరంగా బద్ధశత్రువులుగా కనిపించే పార్టీలు క్షేత్రస్థాయిలో అధికారం కోసం చేతులు కలపడం 'అవకాశవాద రాజకీయం'గా కనిపిస్తున్నా, దీని వెనుక లోతైన వ్యూహాలు దాగి ఉన్నాయి. మున్సిపల్ ఎన్నికల్లో పార్టీల కంటే స్థానిక గెలుపు గుర్రాలే కీలకం కావడంతో చాలా చోట్ల అనూహ్య పొత్తులు కనిపించాయి. బీజేపీ–కాంగ్రెస్, బీఆర్ఎస్–బీజేపీ వంటి అసంభవమైన కలయికలు కొన్ని మున్సిపాలిటీల్లో అధికార పీఠాలను కైవసం చేసుకున్నాయి. నిజామాబాద్ వంటి చోట్ల కాంగ్రెస్–మజ్లిస్ జతకట్టడం గమనార్హం. రాష్ట్ర స్థాయిలో నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకుంటున్నా, స్థానిక కౌన్సిలర్లు మాత్రం తమ ఉనికిని కాపాడుకోవడానికి పార్టీల మధ్య ఉన్న గీతలను చెరిపివేశారు.బీఆర్ఎస్ నేత హరీష్ రావు వంటి వారు ఇతర పార్టీల అనైతిక పొత్తులపై విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, స్థానిక సమీకరణాలు ఎప్పుడూ భిన్నంగానే ఉంటాయి. గ్రామీణ , పట్టణ స్థానిక సంస్థల్లో నాయకత్వం వ్యక్తిగత ప్రాబల్యంపై ఆధారపడి ఉంటుంది. అసెంబ్లీ లేదా పార్లమెంట్ ఎన్నికల నాటికి ఈ సమీకరణాలు మారిపోయి, మళ్ళీ ఆయా పార్టీల అధిష్టానాల ఆదేశాల మేరకు రాజకీయాలు నడుస్తాయి. అయితే ఈ మున్సిపల్ ఎన్నికలు పార్టీల మధ్య ఉన్న రాజకీయ అంటరానితనం పోయిందని స్పష్టం చేశాయి.ఈ ఎన్నికల తర్వాత అత్యంత ఆసక్తికరమైన చర్చ బీజేపీ - బీఆర్ఎస్ పొత్తు గురించి మొదలైంది. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోవాలంటే ఈ రెండు పార్టీలు కలవడం ద్వారా ఓటు బ్యాంక్ ఏకీకరణ జరుగుతుందని ఒక వర్గం అభిప్రాయపడుతోంది. ముఖ్యంగా గత అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల ఓట్ షేర్ కలిపితే అది అధికార పార్టీ కంటే ఎక్కువగా ఉండటమే ఈ చర్చకు ప్రధాన కారణం. కాంగ్రెస్‌ను బలహీనపరచడానికి ఈ రహస్య లేదా బహిరంగ పొత్తు మున్సిపల్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి వెళ్లే అవకాశం ఉందా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో, బీఆర్ఎస్‌కు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పట్టును కలిపితే బలమైన శక్తిగా ఎదగవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఒంటరిగా ఎదుర్కోవడం కంటే, ఉమ్మడి శత్రువును ఓడించడానికి రెండు పార్టీలు చేతులు కలపడం వ్యూహాత్మకంగా లాభిస్తుంది. అయితే, ఈ పొత్తు వల్ల ఇరు పార్టీల సిద్ధాంతాలకు తూట్లు పొడిచినట్లవుతుందనే భయం కూడా నాయకత్వాల్లో ఉంది. మైనారిటీ ఓట్లు కోల్పోతామనే భయం బీఆర్ఎస్‌కు ఉంటే, హిందుత్వ ఓటు బ్యాంకులో చీలిక వస్తుందేమోనన్న ఆందోళన బీజేపీలో ఉంది.రాబోయే రోజుల్లో ఈ రెండు పార్టీలు పొత్తుల గురించి ఆలోచన చేసే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఎందుకంటే, తెలంగాణలో కాంగ్రెస్‌ను ఒంటరిగా ఢీకొట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో కష్టతరమని ఈ మున్సిపల్ ఫలితాలు నిరూపించాయి. రాష్ట్ర స్థాయి రాజకీయం ఎప్పుడూ అధికారం చుట్టూనే తిరుగుతుంది కాబట్టి, భవిష్యత్తులో బీజేపీ–బీఆర్ఎస్ కలిసి పనిచేయడం అనేది అసాధ్యమేమీ కాదు. అయితే అది బహిరంగ పొత్తుగా ఉంటుందా లేదా లోపాయికారి ఒప్పందంగా ఉంటుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# కొత్త బాధ్యతలతో జేడీ

ఒంగోలు, : జేడీ లక్ష్మీనారాయణ.. తెలుగు ప్రజలకు పరిచయం అక్కరలేని పేరు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి మరణానంతరం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వైఎస్సార్ కొడుకు, మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిపై పెట్టిన అక్రమాస్తుల కేసు విచారణతో సీబీఐ డైరెక్టర్‌గా జేడీ లక్ష్మీనారాయణ గుర్తింపు పొందారు. తర్వాత ఉద్యోగం నుంచి స్వచ్ఛంద రిటైర్మెట్ తీసుకున్న ఆయన రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ పెట్టారు. 2019 ఎన్నికల్లో పార్టీ తరఫున అభ్యర్థులను నిలిపి పోటీ చేశారు. కానీ అప్పటి వైసీపీ ధాటికి ఒక్క సీటు కూడా గెలవలేదు. తర్వాత విశ్లేషకుడిగా, మోటివేటర్‌గా కొనసాగుతూ వచ్చారు. మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్ అయిన లక్ష్మీనారాయణ ఇప్పుడు కొత్త ఉద్యోగంలో చేరారు. మేఘా ఇంజినీరింగ్ అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఆపరేషన్స్ వైస్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ నియామకాన్ని సంస్థ లింక్డ్ఇన్‌లో ప్రకటించింది.ఎన్ఐటీ వరంగల్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ బీటెక్, ఐఐటీ మద్రాస్‌లో ఎంటెక్ పూర్తి చేసిన ఆయన అశోక్ లేల్యాండ్ ఆర్ అండ్ డీలో కెరీర్ ప్రారంభించారు. 1990 బ్యాచ్ మహారాష్ట్ర కేడర్ ఐపీఎస్‌గా ముంబైలో అడిషనల్ డైరెక్టర్ జనరల్‌గా ఉద్యోగ విరమణ చేశారు. 2006?13 మధ్య సీబీఐలో జగన్ అక్రమాస్తుల కేసు సహా హైప్రొఫైల్ దర్యాప్తులు చేపట్టారు.పదవీవిరమణ తర్వాత జనసేన పార్టీ తరఫు విశాఖపట్నం ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. 2023లో జై భారత్ నేషనల్ పార్టీ స్థాపించారు. తూర్పు గోదావరి ధర్మవరంలో పొలం కౌలుకు తీసుకొని వ్యవసాయం కూడా చేశారు. కుమారుడు ఆల్ ఇండియా సర్వీసులో పనిచేస్తున్నారు.హైదరాబాద్ కేంద్రంగా పనిచేసే ఈవీ



ట్రాన్స్ దేశంలోనే అతిపెద్ద ఎలక్ట్రిక్ బస్ ఆపరేటర్.

తెలంగాణ ఆర్టీసీ ఒలెక్ట్రా బస్సులు, ముంబై, పుణే, గోవాలోని వాహనాలు తయారు చేస్తుంది. లక్ష్మీనారాయణ ఆర్థిక, కార్యాంగ నిర్వహణ అనుభవం సంస్థ విస్తరణకు ఉపయోగపడుతుందని నిర్వాహకులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదిలా ఉంటే.. ఇటీవల లక్ష్మీనారాయణ భార్య ఆన్‌లైన్ ట్రేడింగ్ స్కామ్‌లో రూ.2.58 కోట్లు కోల్పోయారు. లాభాలు హామీ ఇచ్చి మోసం చేసినవారిపై జనవరిలో సైబర్ క్రై మ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# వన్యప్రాణులను కాపాడుకుందాం



ఇటీవల పెద్దపులుల జనావాసాల్లోకి వచ్చి హడలెత్తించాయి. అడపాదడపా చిరుతలు వస్తూనే ఉన్నాయి. అక్కడక్కడా ఎలుగుబంట్లు దాడి చేస్తున్నాయి. కొన్ని జిల్లాల్లో అడవిపందులు, జింకలు పంటలపై దాడులు చేస్తున్నాయి. ఏనుగులు కూడా పంటలను ధ్వంసం చేస్తున్నా యి. ఇకపోతే కోతుల దాడికి హద్దే లేకుండా పోయింది. ఇలా ఇవన్నీ జనావాసాల్లో ఎందుకు వస్తున్నాయో జనాలు ఆలోచించడంలేదు. ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఇవన్నీ ఇలా జనావాసాల మీద పడడానికి కారణం మనమే. అడవులను, కొండలను ధ్వంసం చేసిన పాపానికి భయాన్ని అనుభవిస్తున్నాం. ఇప్పటికీ ఈ విధ్వంసం ఆగడం లేదు. ఆపాలన్న ఆలోచన రావడం లేదు. మనమే ప్రకృతిని ఇలా విధ్వంసం చేస్తూ పోతే ఇకముందు తరాలు ఇంతకు మించి దారుణా లు ఎదదుర్కోక తప్పదు. వానరాలు ఊళ్లమీద పడి విధ్వంసం సృష్టిస్తు న్నాయి. ప్రకృతి ఒడిలో ప్రశాంతంగా సంచరించే పులులు, చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు వంటి వన్యమృగాలు ఇవాళ మన గడప వరకూ వచ్చేస్తున్నాయి. వన్య ప్రాణులు అడవి దాటి, జనారణ్యంలోకి రావడానికి ప్రధాన కారణం? మనం అడవిగా భావిస్తున్న ప్రాంతంలో అవి జీవించలేకపోవడం. వాటికి కావాల్సిన ఆహారం, నీరు సమృద్ధిగా వుంటే, అవి బిక్కుబిక్కుమంటూ రోడ్ల మీదకు రావు. మనిషిలోని నాగరిక లాభాపేక్ష వృక్ష, జంతు, పక్షి జాతుల క్షీణతకు దారితీస్తోంది. పర్యావరణ పరిరక్షణలో అడవుల పాత్ర కీలకం. కానీ, భారతదేశంలో జనాభా విస్ఫోటనం వల్ల వ్యవసాయాభివృద్ధి, పారిశ్రామికీకరణ, నగరీకరణ, భారీ నీటిపారుదల ప్రాజెక్టులు, జలవిద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణం, రోడ్లు, రైలు మార్గాల అభివృద్ధి వంటి కార్యకలాపాలతో అడవుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతోంది. ఫలితంగా పర్యావరణ సమతుల్యత లోపిస్తోంది. వన్య మృగాలను చూసినప్పుడు, వాటిని హింసించకుండా అధికారులకు తెలియజేసే ప్రయత్నాలు రావాలి. గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు నడపాలి. సంబంధిత ప్రభుత్వ శాఖలు సరైన సమయంలో సరైన చర్యలు తీసుకోవడం, ప్రజలు ఆత్మరక్షణ చేసుకుంటూనే, హింసకు దూరంగా ఉండి అధికారులకు సమాచారం అందించడం అత్యవసరం. కేరళలో 'వన్యమృగ బీటర్లు' వంటి స్వచ్ఛంద సంఘాలు వన్య మృగాలను పట్టి, అడవుల్లో విడిచిపెడతారు. అలాగే, సోలార్ ఫెన్సింగ్, బయోఫెన్సింగ్ వాడుతారు. వన్యప్రాణులను మన 'అతిథులు'గా చూడాలి. వాటిని తిరిగి అడవిలోకి పంపేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అడవుల పునరుద్ధరణకు పూనుకోవాలి. చిన్నా, పెద్ద తేడా లేకుండా పర్యావరణం పట్ల అవగాహన కలిగించాలి. మనిషిని, వన్యమృగాన్ని రక్షించే ఏకైక మార్గం?అడవులను, పర్యావరణాన్ని కాపాడుకోవడం అన్న సంగతి గుర్తించాలి. అడవులను నరికివేయడం,ఖనిజాల వెలికితీత పేరుతో కొండలను ధ్వంసం చేయడం వల్ల జరుగుతున్న దుష్పరిణామం ఇది. సహజవనరులను దోచుకోవడానికి అటవీ భూములను కట్టబెట్టడం, అభివృద్ధి పేరుతో ప్రకృతి సిద్ధమైన సహజ ఆవాసాలను, టూరిజం పేరుతో కొండలు, గుట్టలను ఛిద్రం చేయడం వంటి దుశ్చర్యల ఫలితమే ఈ ఫలితం అని గుర్తించాలి. ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటకల్లోని అటవీ పరిసర ప్రాంతాల్లో ఇలాంటి సంఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. ఇది కేవలం వన్యమృగాల దూకుడు మాత్రమే కాదు, మనిషి దుందుడుకు చర్యలకు ప్రతిస్పందన కూడా! అ వన్యప్రాణుల వలసకు మూల కారణం మానవాభివృద్ధి తెచ్చిన దురాశ. దేశంలో 1951లో 40.4 శాతం అటవీప్రాంతం ఉండగా, ఇప్పుడది 21.7 శాతానికి తగ్గినట్లు ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఫాస్ట్ ట్రాక్ ప్రాజెక్టులు, మైనింగ్, రోడ్లు, రియల్ ఎస్టేట్‌లు సహజ అడవులను మింగేస్తున్నాయి. దాదాపు 70 శాతం మంది భారతీయులు అడవులకు సమీపంలోనే నివసిస్తున్నారు. మనిషి– వన్యప్రాణుల సంఘర్షణ వల్ల ప్రతి సంవత్సరం 500 మందికి పైగా మరణిస్తున్నారని ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఇది వందలాది వన్యమగాల మరణాలకూ కారణమౌతోంది. 'భూమి మనందరి ఆస్తి కాదు'. కానీ మనం అడవులను సొంత 'ఆస్తి'గా భావిస్తూ విధ్వంసానికి పాల్పడుతుండటం వల్లే ప్రకృతి తిరుగుబాటు చేస్తోంది. ఇటీవల తెలంగాణ,తూర్పుగోదావరి జిల్లా ప్రజలకు కొన్ని రోజుల పాటు కంటిమీద కునుకు లేకుండా చేసిందో పెద్దపులి. ఎట్టకేలకు అటవీశాఖ సిబ్బంది దానికి మత్తు ఇంక్షన్ ఇచ్చి పట్టుకున్నారు. తెలంగాణలోని జనగామ, సిద్ధిపేట జిల్లాల పరిధిలోనూ పెద్దపులి సంచారం కలకలం రేపింది. ఇళ్లలోకి, పంట పొలాల్లోకి పులి తదితర జంతుజాలం వచ్చేస్తున్నాయి. ఏనుగులు సైతం పంట పొలాల్లోకి వచ్చి ధ్వంసం చేస్తున్న ఘటనలు తరచూ చోటుచేసుకుంటున్నాయి. నెమళ్లు వంటి అరుదైన పక్షులకూ భద్రత లేకుండాపోయింది. ఇది సహజ పర్యావరణ వ్యవస్థలను భంగపరచడంతో పాటు, జీవవైవి ధ్యాన్ని నిర్వీర్యం చేస్తోంది. ఒక చెట్టు పడిపోతే పది చెట్లను నాటడం అలవాటు చేయాలి. ఇప్పుడు దేశానికి కావాల్సింది అటవీ సంరక్షణ, ప్రకృతి విధ్వంసం ఆపడం. అడవుల నరికివేతను అరికట్టాలన్న దృఢనిర్ణయం, మానవుల నుంచి రక్షణ కల్పించడం అన్నది ఉద్యమంగా సాగాలి. ప్రకృతి మనకు ఇచ్చిన బహుమతి అడవి. మనం దాన్ని కాపాడుకోవడం ద్వారా మనలను మనం రక్షించుకోవాలి. ప్రకృతిపై మనిషికి అధికారం లేదు. బాధ్యత మాత్రమే వుంది అన్న విషయాన్ని గుర్తించాలి. అప్పుడే వన్యప్రాణులకు రక్షణ ఉంటుంది.

# జాగ్రత్త మిత్రమా!.. వ్యాధుల ఉచ్చులో చిక్కుకోవద్దు



తస్మాత్ జాగ్రత్త! అన్ని విషయాల్లోనూ పెద్దలు చెప్పే మాట ఇది. ముందుచూపు ఉన్నవాడే ముందడుగు వేయగలడు. ఆర్థిక విషయాల్లోతప్పటడుగు వేస్తే.. రెండేండ్లకో, మూడేండ్లకో కోలుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం విషయంలో ఈ సూత్రం చెల్లదు.

'నాకేమవుతుంది!' అన్న నిర్లిప్త ధోరణి మిమ్మల్ని రోగాల విష వలయంలోకి నెట్టేయొచ్చు. ఆరోగ్య బీమా ఉంటే.. చికిత్సకయ్యే ఖర్చులు మీదపడకుండా ఉంటాయి కానీ, మీ బీమా రోగం రాదన్న ధీమా ఇవ్వదు కదా!! మరెలాగంటారా?!

ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలితో రాగల రోగాలను అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి వ్యాధుల నైనానయం చేసే శక్తి ఆధునిక వైద్యరంగానికి ఉంది! కానీ, అదే సమయంలో వేగంగా పెరుగుతున్న రోగాలు వైద్యులకూ సవాళ్లు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త లు తీసుకోవడం చాలా అవసరం అంటున్నారు వైద్యులు. గతంతో పోలిస్తే.. ఈ మధ్య కాలంలో ఎలాంటి వ్యాధులు పెరుగుతున్నాయి, అందుకు కారణాలేంటి? మారుతున్న జీవనశైలి మనిషి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం!

ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' నానుడి ఆరోగ్యానికి సంబంధించినదే! సంపాదన వేటలో పరుగులు తీస్తున్న మనిషి ఆరోగ్యాన్ని చాలా నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీనికితోడు జిహ్వ చాపల్యాన్ని చంపుకోలేక, అలవాట్లు మానుకోలేక, వ్యాయామం చేసే తీరిక లేకొ ఇలా రకరకాల కారణాలతోరోగాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నడి వయసులోనే దవాఖానల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి.ముప్పయ్ ఏండ్లలోనే గుండె జబ్బులు పలకరిస్తున్నాయి. నలభై రాకముందే కిడ్నీలు మొరాయిస్తున్నాయి. డబ్బుల్లో రావాల్సిన నరాల సమస్యలూ యాభై రాకముందే ముంచుకొస్తున్నాయి. దీనికంతటికీ కారణంఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడమే!

ముప్పయ్ రాకుండానే.. గుండెకు ముప్పు: ఒకప్పుడు యాభై ఏండ్లు దాటాక గానీ, గుండె సమస్యలు పలకరించేవి కావు. కానీ, ఇప్పుడు ముప్పయ్‌లోకి అడుగు పెట్టకముందే గుండె సంబంధిత రుగ్మతలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది, 20 30 ఏళ్లలోపు వయసు వారు కూడా తీవ్రమైన గుండె జబ్బులకు గురవడం విచారకరం. అయితే చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధులకు గురైనవారిలో ఎక్కువ శాతం రక్తపోటు లేదా అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ తరహా సమస్యల్లో చిక్కుకుంటున్న వాళ్లు కనీస ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోకపోవడం గమనార్హం. తాజా అధ్యయనాల ప్రకారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో సుమారు 30 శాతం మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారట. వీరంతా అసహజమైన జీవనశైలి కారణంగానే ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గణాంకాల ప్రకారం భారతదేశంలో 40 ఏళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలో ఒకరికి గుండెపోటును చూస్తున్నాం. సరైన జీవనశైలి, వ్యాయామం, నడక, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండెకు వచ్చే జబ్బులను చాలా వరకు నియంత్రించవచ్చు.

యువతలో బలహీనత: న్యూరాలజిస్టుల నివేదికల ప్రకారం స్ట్రోక్ కేసులను పరిశీలిస్తే, దాదాపు మూడోవంతు యువతలోనే నమోదవుతున్నాయి. దీనికి అధిక రక్తపోటు, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒకేచోటఎక్కువసేపు కూర్చునిఉండే ఉద్యోగాలు చేయడం వల్ల న్యూరాలజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా.. ముందస్తుగా మేల్కొనాలి. దురలవాట్లకు చెక్ పెట్టాలి. వర్క్‌స్టైల్‌ని మీ ఆరోగ్యానికి తగ్గట్టుగా డిజైన్ చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏదైనా అసౌకర్యాన్ని గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి.

పీడిస్తున్న మధుమేహం: జీవనశైలి రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాస్తఅలవాట్లు పక్కదారి పట్టినా.. మధుమేహం దాడి చేస్తున్నది. గతేడాది యువ ఉద్యోగులు, విద్యార్థుల్లో మధుమేహం, ఊబకాయ సమస్య అనూహ్యంగా పెరగడం కనిపించింది. ఎండోక్రైనా లజీ విభాగం

## చికిత్స ఒక్కటే పరిష్కారం కాదు జీవనశైలిలో మార్పే శ్రీరామరక్ష

గణాంకాల ప్రకారం, టైప్ 2 మధుమేహం యువతలో వేగంగా పెరుగుతున్నది. సుమారు 40 శాతం మందికి తమకు డయా బెటిస్ ఉందన్న విషయమే తెలియకపో వడం గమనార్హం.

అంతేకాదు, మధుమేహ బాధితుల్లో 50 శాతం మందిలో వ్యాధి అస్సలు నియంత్రణలో ఉండటం లేదట. దీనివల్ల మూత్రపిండాల సమస్యలు, గుండె వ్యాధులు, సంతానలేమి తదితర సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం.


నెఫ్రాలజీ రికార్డుల ప్రకారం, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌ను సమయానికి గుర్తించకపోవడం వల్ల యుక్త వయసులోనే తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.

పొట్ట చుట్టూ సమస్యలే: ఫ్యాటీ లివర్, కొలొరెక్టల్, పేగు సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధిక క్యాలరీలతో కూడిన ఆహారం,ప్రాసెస్డ్ ఫుడ్స్, మద్యపానం,అస్థిర జీవనశైలితదితర కారణాలతో ఈ సమస్యలు యువతలోనే ఎక్కువగా చూస్తున్నాం. మన దేశంలో నమోదవుతున్న కొలొరెక్టల్ క్యాన్సర్ కేసుల్లో 30 40 శాతం మంది 50 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే అంశం.


క్యాన్సర్ దాడి: ఈ మధ్య కాలంలో బ్రెస్ట్, ఒవేరియన్, గ్యాస్ట్రో ఎంటెస్టినల్ వంటి క్యాన్సర్లు ఎక్కువగా యువతలోనే కనిపిస్తున్నాయి. వయసుతో సంబంధం లేని ఈ వ్యాధిపై జన్యు లక్షణాలు, జీవనశైలి, పర్యావరణ ప్రభావాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి.

మొత్తంగా చూస్తే, గుండె, మెటబాలిక్, కాలేయం, మూత్రపిండాలు, న్యూరాలజీ, జీర్ణవ్యవస్థలకు సంబంధించిన నివారించగల దీర్ఘకాలిక వ్యాధుల్లో 10 15 శాతం పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో చాలా వ్యాధులను ప్రారంభదశలో స్క్రీనింగ్, జీవనశైలి మార్పులు, సమయానికి వైద్య పరీక్షల ద్వారా నివారించగలిగినవే.

వారిపై తీవ్ర ప్రభావం: మారుతున్న జీవనశైలి, పని ఒత్తిడి కారణంగా కొన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అందులో ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే యువత రోజుకు పది గంటలకు పైగా ఒకే చోట కూర్చుని పనిచేయడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌పై ఆధారపడటం వల్ల అనారోగ్య సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దేశ జీడీపీ, అభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన యువత అనారోగ్యం పాలవ్వడం దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి.జబ్బు వచ్చిన తర్వాత చికిత్సచేయడం కంటే, జబ్బు రాకుండా చూసుకోవడం ప్రధానం అని గ్రహించాలి. జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధులను వృద్ధాప్యం వరకు వాయిదా వేయవచ్చు. ఆర్థికంగా దెబ్బ: కార్పొరేట్ ఎంప్లాయి మొదలుకొని, సాధారణ ఉద్యోగి వరకు ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉంటున్నారు. ఉద్యోగంలో చేరగానే.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తుందేమో కానీ, వ్యాధులను రాకుండా అడ్డుకోదు కదా! ఇక ఇన్సూరెన్స్ లేనివారి పరిస్థితి అగమ్య గోచరం.ఒక వ్యక్తి ఆస్పత్రి పాలైతే.. ఆ భారంకుటుంబం అంతా మోయాల్సి వస్తుంది. తీవ్రమైన వ్యాధులు తలెత్తితే.. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది.




# నిద్ర పట్టడం లేదా!



అన్ని బాధ్యతలు తీరినా, కావాల్సినంత సమయం ఉన్నా, ఆరోగ్యం నిలకడగా ఉన్నా.. వృద్ధాప్యంలో వెంటాడే సమస్య నిద్రలేమి. ఇందుకు ప్రధానమైన కారణం ఒంటరితనమే అని పలు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ ఒంటరితనంతో మనిషి లేనిపోని ఆలోచనల వలయంలో చిక్కుకుంటాడు. పిల్లలు ఎవరి జీవితంలో వాళ్లు సెటిలయ్యారన్న తృప్తి ఉన్నా.. తమ దగ్గర లేరన్న బెంగ మనసును తొలిచేస్తూ ఉంటుంది. తమకు ఏదైనా జరిగితే పిల్లలు వస్తారో, రారో అన్న అనుమానం కూడా వెంటాడుతుంది.ఇవన్నీ వయసు పైబడిన వారి మనసులో బలంగా నాటుకుపోతాయి. పైకి ఆరోగ్యంగా కనిపించినా, మానసికంగా ఆందోళనగా ఉంటారు. ఫలితంగా రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టదు. మనసు ఉత్సాహంగా లేకపోతే.. తీసుకునే ఆహారంపై ఆ ప్రభావం పడుతుంది. అన్యమనస్కంగా తినడం, భోజనాన్ని స్కిప్ చేయడం లాంటివి చేస్తుంటారు. దీనివల్ల ఆరోగ్యం కుంటుబడుతుంది. విటమిన్ల లోపం తలెత్తి కాళ్లుచేతులు లాగడం మొదలవుతుంది. రక్తహీనత కూడా వెంటాడుతుంది. ఇవన్నీ నిద్రను దెబ్బతీస్తాయి. నిద్రలేమితో సతమతం అవుతుంటే.. వైద్యుణ్ని సంప్రదించండి. మధుమేహం, రక్తపోటు తదితర సమస్య లు ఉన్నట్లయితే.. వైద్యులు సూచించిన మందులు సమయానికి తీసుకోవాలి. కొన్నిసార్లు మందుల మోతాదులు తగ్గించడం, మార్చడం వల్ల కూడా నిద్రలేమి సమస్యకు చెక్‌పెట్టొచ్చు. అయితే, మందుల విషయంలో సొంత నిర్ణయం తీసుకోకుండా, మీ వైద్యుణ్ని సంప్రదించాలని గుర్తుంచుకోండి. కొందరు మధ్యాహ్నం పూట ఎక్కువ సమయం నిద్ర పోతుంటారు. ఆ ప్రభావం రాత్రి నిద్ర మీద పడుతుం ది. కాబట్టి, మధ్యాహ్నం వేళ.. కాసేపే నడుం వాల్చండి. అలాగే, ఉదయం, సాయంత్రం నడక తప్పనిసరి చేసుకుంటే.. ఇది రాత్రి నిద్రకు ఉపకరిస్తుంది. రాత్రి తేలికపాటి భోజనం చేయడం మంచిది. తిన్న తర్వాత ఓ పదిహేను నిమిషాలు నడక సాగించండి. పడుకునే ముందు ఫోన్ పక్కన పెట్టండి. శ్రావ్యమైన సంగీతం వినండి. కాసేపు పుస్తకం చదవండి. పడుకునే ముందు ఒక గ్లాసు పాలు తాగితే మంచిది. అన్నిటికీ మించి.. జీవితం చూసొచ్చిన మీరు.. గతాన్ని తవ్వుకుంటూ కాలాన్ని వృథా చేసుకోకండి. మానసికంగా ప్రశాంతం గా ఉంటే.. నిద్రలేమి సమస్య దూరం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

# ఆ రాళ్లను తేలిగ్గా తీసుకోకండి..



గాల్‌బ్లాడర్ స్టోన్స్ వీటినే వాడుక భాషలో పిత్తాశయ రాళ్లు అంటారు. ఈ పిత్తాశయం అనేది కాలేయం కింది భాగంలో ఉంటుంది. కాలేయం నుంచి పైత్య రసం పిత్తనాళం ద్వారా చిన్న పేగుకు చేరుతుంది. దీనినే కామన్ బైల్‌డక్ అంటారు.

అంతేకాకుండా పిత్తాశయంలోని పైత్యరసం ఖాళీ అయినప్పుడు అది కూడా పిత్తనాళం ద్వారానే చిన్న పేగుకు చేరుతుంది. ఈ క్రమంలో పిత్తాశయంలో లేదా పిత్తనాళంలో రాళ్లు ఏర్పడుతుంటాయి. అయితే పిత్తనాళంలో రాళ్లు ఏర్పడటం అనేది అరుదుగా చూస్తుంటాం. ఈ పిత్తాశయంలో, పిత్తనాళంలో ఏర్పడే రాళ్లు, వాటితో తలెత్తే సమస్యలు, లక్షణాలు, నిర్ధారణ, చికిత్సా పద్ధతులను నేటి ఊపిరిలో తెలుసుకుందాం.

అధిక బరువు, ఊబకాయంతో సతమతమయ్యే వాళ్లలో గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఏర్పడే అవకాశాలు ఉన్నాయి. అంతేకాకుండా హార్మోన్ల మార్పిడి వల్ల పురుషుల్లో కన్నా మహిళల్లో ఎక్కువగా ఈ సమస్య తలెత్తుతుంది. అలాగే డయాబెటిస్ రోగుల్లో కూడా గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఏర్పడే ప్రమాదం ఉంటుంది. అయితే 80 నుంచి 90 శాతం వరకు పిత్తాశయంలోని రాళ్లు సైలెంట్‌గా ఉంటాయి. అంటే వీటి వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. ఏదైనా ఇతర అనారోగ్య సమస్యల కోసం అల్ట్రాసౌండ్ స్కాన్ చేసినపుడు గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఉన్నట్లు బయటపడుతుంటాయి. అయితే పిత్తాశయ రాళ్ల వల్ల పెద్ద సమస్యలు ఉండవు. అందుకని వీటికి పెద్దగా చికిత్స తీసుకునే అవసరం ఉండకపోవచ్చు.

అలాంటి సందర్భంలో..: 10 20 శాతం మందిలో కొన్నిసార్లు పిత్తాశయంలోని రాళ్ల వల్ల ఇన్‌ఫ్లమేషన్ గానీ, ఇన్‌ఫెక్షన్ గానీ తలెత్తుతుంది. దీనివల్ల ఉదరం పైభాగంలో భరించలేని నొప్పి వస్తుంది. కామెర్లు రావడం, చలిజ్వరం వంటి లక్షణాలు కనిపిస్తాయి. అలాంటి సందర్భంలో అల్ట్రాసౌండ్ స్కానింగ్ చేయించాలి. ఈ స్కానింగ్ ద్వారా గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఉన్నట్లు నిర్ధారణ జరిగితే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఇలా తీవ్రమైన నొప్పికి కారణమయ్యే పరిస్థితినే వైద్య పరిభాషలో 'అక్యూట్ కాలిక్యులస్ కోలిస్‌సిట్కస్టైటిస్' అంటారు. ఇది ఒక మెడికల్ ఎమర్జెన్సీ. ఇలాంటి సందర్భంలో వెంటనే శస్త్రచికిత్స జరిపి, రాళ్లను తొలగించాల్సి ఉంటుంది.


రాళ్లు ఏర్పడితే..: పిత్తాశయంలో ఉన్న రాళ్లు కొన్నిసార్లు పిత్తనాళంలోకి అడ్డుగా పడిపోవచ్చు. దీనినే కామన్ బైల్‌డక్ స్టోన్ (సీబీడీ) అంటారు. ఇలాంటి సమయంలో రోగికి తీవ్రమైన నొప్పి లేదా కామెర్లు (జాండీస్) రావడం జరుగుతుంది.

అంతేకాకుండా 'అక్యుట్ ప్యాంక్రియాటైటిస్' అనే జబ్బు కూడా వచ్చే ప్రమాదం ఉంటుంది. ఇది కూడా ఒక మెడికల్ ఎమర్జెన్సీ. కొన్ని సందర్భాలలో ఇది ప్రాణాంతకంగా మారవచ్చు. అందుకని సకాలంలో శస్త్రచికిత్స చేయడం చాలా అవసరం. లేకపోతే ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది.

చికిత్స ఎప్పుడు, ఎవరికి..?: పిత్తాశయ రాళ్లకు అన్ని సందర్భాలలో శస్త్రచికిత్స అవసరం లేదు. కానీ, డయాబెటిస్ రోగులు, ప్రెగ్నెన్సీకి ప్లాన్ చేసుకునే మహిళలు గాల్‌బ్లాడర్ స్టోన్స్ ఉంటే వెంటనే శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమం. లేకపోతే అది తీవ్ర పరిణామాలకు దారి తీయవచ్చు. పిత్తాశయ రాళ్ల వల్ల నొప్పి వచ్చినప్పుడు ఏ మాత్రం అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి. మందుల వల్ల గాల్‌బ్లాడర్ స్టోన్స్ (పిత్తాశయంలోని రాళ్లు) గానీ, కామన్ బైల్‌డక్ స్టోన్స్ (పిత్తనాళం రాళ్లు) గానీ కరగకపోవచ్చు. అందుకని ఈ రాళ్లను తొలగించడానికి శస్త్రచికిత్స ఒక్కటే మార్గం. పిత్తాశయంలోని రాళ్ల వల్ల 80 నుంచి 90 శాతం వరకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉండవు. ఏ విధమైన లక్షణాలు, సమస్యలు లేనంత వరకు పిత్తాశయంలోని రాళ్ల కోసం చికిత్స అవసరం పడకపోవచ్చు. కానీ, పిత్తనాళంలో ఉన్న రాళ్ల విషయంలో మాత్రం చికిత్స తప్పనిసరి. వాటివల్ల ఎలాంటి సమస్య లేనప్పటికీ ఎప్పటికైనా కామెర్లు, జ్వరం, ప్యాంక్రియాటైటిస్ సమస్యలు పొంచి ఉంటాయి.

లక్షణాలు: కామెర్లు రావడం, చలి జ్వరం, కడుపులో భరించలేని నొప్పి రావడం,. నిర్ధారణ పద్ధతులు: పిత్తాశయంలోని రాళ్లను లేదా పిత్తనాళంలో ఉన్న రాళ్లను గుర్తించడానికి అల్ట్రాసౌండ్ స్కానింగ్ పరీక్షలు చేస్తారు. ఎంఆర్ సీపీ ద్వారా కూడా ఈ రాళ్లను నిర్ధారించవచ్చు. చికిత్సా పద్ధతులు: ఎండోస్కోపి శస్త్రచికిత్స పద్ధతి (ఈఆర్‌సీపీ)ద్వారా పిత్తనాళంలో ఉన్న రాళ్లను తొలగించడం ఉత్తమం. ఇది అడ్వాన్స్ శస్త్రచికిత్స. గతంలో ఓపెన్ సర్జరీ ద్వారా చేసేవారు. ఓపెన్, ల్యాపరోస్కోపీ సర్జరీల కంటే ఈఆర్‌సీపీ పద్ధతిలో చాలా సులభమైన పద్ధతి. కాగా, పిత్తనాళంలోని రాళ్లను తీసిన తరువాత పిత్తాశయం సర్జరీ కూడా చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే పిత్తాశయంలోని రాళ్లు మళ్లీ పిత్తనాళంలోకి పడిపోయే అవకాశం ఉంటుంది. అందుకని పిత్తాశయంలోని రాళ్లను పూర్తిగా తొలగిస్తే, పిత్తనాళంలో మళ్లీ రాళ్లు ఏర్పడే అవకాశం ఉండదు. కీహోల్ పద్ధతి ద్వారా పిత్తాశయంలోని రాళ్లను తొలగించడం జరుగుతుంది.

# యువగుండెను కాపాడుకుందాం...



మన కళ్లముందున్న యువతరం చూసేందుకు ఆరోగ్యంగా, ఫిట్‌గా కనిపించినా.. అకస్మాత్తుగా గుండెపోటుతో కుప్పకూలిపోతున్నారు. భారత్‌లో 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు వారిలో నెలకొన్న ఈ ప్రమాదంపై 2025లో ఎయిమ్స్–ఐసీఎంఆర్ కలిసి చేపట్టిన అధ్యయనంలో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. యువతలో సంభవిస్తున్న ఆకస్మిక మరణాల్లో 42.6 శాతం గుండె సంబంధిత సమస్యలే కారణమని ఈ పరిశోధన వెల్లడించింది. చాలామంది యువకులు తాము ఆరోగ్యంగా ఉన్నామని, తమకు ఎలాంటి లక్షణాలు లేవని భావిస్తుంటారు. బయటికి ఆరోగ్యంగా కనిపించడం అంటే గుండె సంపూర్ణంగా పనిచేస్తున్నదని అర్థం కాదు. చాలా సందర్భాలలో ముప్పు కారకాలను ప్రాథమిక దశలో గుర్తించకపోవడమే ప్రమాదాలకు దారితీస్తున్నది. మన గుండెలో తెలియని చర్యలు అనేకం జరుగుతుంటాయి. అందు లో ఒకటే ఈ ఏఎస్‌సీవీడీ. ధమనుల్లో కొవ్వు, కొలె(స్ట్రాల్ పేరుకుపో వడాన్ని 'అథెరోస్క్లెరోటిక్ కార్డియోవాసులర్ డిసీజ్' (ఏఎస్‌సీవీడీ) అంటారు. ఇది చాలా నెమ్మదిగా జరిగే ప్రక్రియ. 50 శాతం కంటే తకువ బ్లాకేజీలు ఉన్నప్పుడు శరీరంలో ఎలాంటి లక్షణాలు కనిపించవు. 70 శాతం దాటితేనే విశ్రాంతి తీసుకునే సమయంలో కూడా గుండె నొప్పి లక్షణాలు బయట పడతాయి. అప్పటివరకు ఆరోగ్యంగా ఉన్న యువకుడిలో ఒకసారిగా ఈ కొవ్వు నిల్వలు చిట్లిపోతే అది తీవ్రమైన గుండెపోటుకు దారితీస్తుంది. మారుతున్న జీవనశైలి కారణంగానే యువతలో ఈ ముప్పు పెరుగుతున్నది. వాటిల్లో ధూమపానం, ఈ–సిగరెట్లు, మాదకద్రవ్యాల వాడకం, విపరీతమైన ఒత్తిడి ప్రధానమైనవి. శారీరక శ్రమ లేకపోవడం, ఊబకాయం, జంక్ ఫుడ్, మితిమీరిన మద్యపానం లాంటి చెడు అలవాట్లు మన గుండెకు చిల్లులు పెడుతున్నాయి. ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడి లేని జీవితం, సకాలంలో ఆరోగ్య పరీక్షలు.. ఇవే మీ గుండెను భద్రంగా ఉంచే ఆయుధాలు.

# కాఫీకీ ఓ టైముంది!

కాఫీ తాగడం.. ఆరోగ్యానికి మంచిదే! కానీ, ఎప్పుడు తాగుతున్నాం? ఎంత తాగుతున్నాం? అనేది కూడా ముఖ్యమని అంటున్నారు అమెరికా పరిశోధకులు. గుండె, శరీరం మీద కెఫీన్, కాఫీ తాగే సమయం చూపించే ప్రభావాలపై ఓ పరిశోధన జరిగింది. అమెరికా నేషనల్ హెల్త్ అండ్ న్యూట్రిషన్ ఎగ్జామినేషన్ సంస్థ.. దాదాపు పదేండ్లపాటు ఈ అధ్యయనం నిర్వహించింది. ఇందులో పాల్గొన్నవారు రోజుకు కనీసం ఒక్కసారైనా తీసుకునే ఆహారం, పానీయాలను క్షుణ్ణంగా పరిశీలించింది. సర్వే సమయంలో సంభవించిన మరణాలను, వాటి కారణాలను నమోదు చేసింది. ఆయా డేటాలను విశ్లేషించి.. ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. వీరిలో 52 శాతం మందికి కాఫీ తాగేఅలవాటు ఉంది. అందులోనూ 36 శాతం మంది ఉదయం మాత్రమే కాఫీ తాగుతుండగా.. మిగిలిన 16 శాతం మంది రోజులో అనేకసార్లు కాఫీ తాగుతారని చెప్పారు.

అయితే, కాఫీ తాగనివారితో పోలిస్తే.. ఉదయంపూట కాఫీ తాగేవారికి ఏ కారణంతోనైనా మరణం సంభవించే ముప్పు 16 శాతం, గుండెజబ్బుతోమరణించే ముప్పు 31శాతం తక్కువగా ఉంటున్నట్టు తేలింది. అయితే,రోజంతా రెండుమూడు సార్లు కాఫీ తాగేవారిలో ఇలాంటి ప్రయోజ



నాలేవీ కనిపించలేదని పరిశోధకులు వెల్లడించారు. మధ్యాహ్నం, సాయంత్రం కాఫీ తాగేవారిలో జీవ గడియారం క్రమం తప్పుతుందనీ, మెలటోనిన్ వంటి హార్మోన్ల మోతాదులు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని చెప్పుకొచ్చారు. ఫలితంగా ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీసి.. రక్తపోటు, గుండెజబ్బు ముప్పు పెరుగుతుందని హెచ్చరిస్తున్నారు.

# సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి 'లోక' సీక్వెల్



'లోక: చాప్టర్ 1' చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది మలయాళీ భామ కల్యాణి ప్రియదర్శన్. ఈ సూపర్ ఉమెన్ ఫాంటసీ థ్రిల్లర్‌లో ఆమె అభినయానికి సర్వత్రా ప్రశంసలు దక్కాయి. గత ఏడాది మలయాళంలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా 'లోక: చాప్టర్ 1' రికార్డులు సృష్టించింది. ఈ నేపథ్యంలో ఈ సినిమా సీక్వెల్ గురించి ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇటీవలే ఓ ఈవెంట్‌లో పాల్గొన్న కల్యాణి ప్రియదర్శన్ సీక్వెల్‌లో తాను భాగమవుతున్నానని వెల్లడించింది. ప్రస్తుతం స్క్రిప్ట్‌వర్క్‌లో ఉన్న ఈ సినిమా సెప్టెంబర్‌లో సెట్స్‌పైకి వెళ్తుందని, సీక్వెల్‌లో విజువల్స్‌కు అధిక ప్రాధాన్యం ఒటుందని.. కథ, కథనాలు మరింత ఉత్కంఠను పంచుతాయని తెలిపింది.





# విశ్వక్‌సేన్ డైరెక్షన్‌లో కల్ట్




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరోసారి మెగా ఫోన్ పట్టాడు. విశ్వక్ స్వీయ దర్శకత్వంలో రాబోతున్న చిత్రం 'కల్ట్' ' ఫలక్‌ను మా దాస్', 'దాస్ కా దమ్కీ' వంటి సినిమాల తర్వాత ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం కావడంతో సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రం ఎంతో ఉత్కంఠభరితంగా, సాహసోపేత మైన కథాంశంతో ఉండబోతుందని తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమా ద్వారా ఏకంగా 40 మంది కొత్త నటీనటులను వెండితెరకు పరిచయం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఇందులో గాయత్రి భరద్వాజ్ కథానాయికగా నటిస్తున్నట్లు సమాచారం. వియత్నాంలో జరిగిన నిజ జీవిత సంఘటనల ఆధారంగా, నేటి కాలపు యువతను ఆకట్టుకునేలా ఒక కొత్త తరహా కథను విశ్వక్ సేన్ స్వయంగా రాసి తెరకెక్కించినట్లు తెలుస్తుంది. ఇప్పటికే విడుదలైన ఈ చిత్ర పోస్టర్లు మరియు ప్రచార చిత్రాలు సినిమాపై భారీ అంచనాలను పెంచాయి. ఈ చిత్రానికి 'కేజీఎఫ్' ఫేమ్ రవి బస్రూర్ సంగీతాన్ని అందిస్తుండగా, ప్రముఖ దర్శకుడు తరుణ్ భాస్కర్ సంభాషణలు రాస్తుండటం విశేషం. సందీప్ కాకర్ల మరియు కరాటే రాజు నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు హిందీ, ఇంగ్లీష్, జపనీస్ మరియు స్పానిష్ వంటి అంతర్జాతీయ భా షల్లో కూడా విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నారు.

# తమన్నా, పూజా హెగ్డే. మధ్య పోటీ!



సినీ రంగం లో తమన్నా, పూజ హెగ్డే లకు ఉన్న క్రేజ్ ఎలాంటిదో ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ప్రతీ ఏటా ఎంతో మంది యంగ్ హీరోయిన్లు ఇండస్ట్రీ లోకి అడుగుపెట్టొచ్చు, కానీ వీళ్లిద్దరి క్రేజ్ మాత్రం ఇసుమంత కూడా తగ్గలేదు. హిట్, ఫ్లాప్ లతో సంబంధం లేకుండా, వరుసగా సినిమాలు చేస్తూ దూసుకెళ్తున్నారు ఈ ఇద్దరు హీరోయిన్స్. అయితే వీళ్లకు ఏ మాత్రం సంబంధం లేని రాజకీయాలు, ఇప్పుడు వీళ్లిద్దరు చుట్టూ తిరుగుతున్నాయి. పూర్తి వివరాల్లోకి వెళ్తే కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ యాజమాన్యం లో ఉండే మైసూర్ శాండిల్ సోప్ కి బ్రాండ్ అంబాసిడర్ గా వ్యవహరించేందుకు తమన్నా ని ఎంపిక చేశారు. ఒకప్పుడు దేశవ్యాప్తంగా మైసూర్ శాండిల్ సోప్స్ కి ఉన్న క్రేజ్ మామూలుది కాదు. ఈమధ్య కొత్త ప్రొడక్ట్స్ కారణంగా ఈ బ్రాండ్ కి కాస్త క్రేజ్ తగ్గింది.అందుకే ప్రభుత్వం ఈ సోప్ ను రీ బ్రాండింగ్ చేస్తూ, నేడు లాంచింగ్ కార్యక్రమాన్ని నిర్వహించింది. అయితే ఈ బ్రాండ్ కి తమన్నా ని ఎంపిక చేయడం పై ప్రతిపక్ష పార్టీలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతున్నాయి.

కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఎంతో మంది హీరోయిన్లు ఉన్నారు, వాళ్ళని బ్రాండ్ అంబాసిడర్ గా ఎంచుకోవచ్చు కదా, ఎందుకు తమన్నా ని ప్రత్యేకించి తీసుకున్నారు. కర్ణాటక లో పుట్టిన పెరిగిన పూజా హెగ్డే ని ఎందుకు ఎంచుకోలేదు?, ఆమెతో పాటు రష్మిక మందాన,రుక్మిణి వాసంత్, శ్రీనిధి శెట్టి వంటి పాన్ ఇండియన్ స్టార్ హీరోయిన్లందరూ కర్ణాటక రాష్ట్రానికి చెందిన వారే. క్రేజ్, ఫాలోయింగ్, ఫేమ్ విషయంలో వీళ్ళు తమన్నా కి ఏ మాత్రం తీసిపోరు. అయినప్పటికీ వీళ్ళలో ఎవరో ఒకరిని ప్రభుత్వం ఎందుకు ఎంచుకోలేదు అంటూ నిలదీస్తున్నారు.

ప్రతి పక్ష పార్టీ కి చెందిన నేతలు.బీజేపీ పార్టీ నాయకులూ కూడా ఈ విషయం లో ప్రభుత్వాన్ని తీవ్ర స్థాయిలో తప్పుబడుతున్నారు. స్థానిక తారలను విస్మరించడం స్థానిక కాంగ్రెస్ నేత కన్నడ వ్యతిరేక మనస్తత్వానికి నిదర్శమని అంటున్నారు. అలా తమన్నా, పూజా హెగ్డే , రష్మిక వంటి హీరోయిన్ల పేర్లు రాజకీయాలకు ఏ మాత్రం సంబంధం లేకపోయినా అక్కడి నేతలు తీస్తున్నారు. అయితే కర్ణాటక ప్రభుత్వం మాత్రం ఈ విమర్శలను లెక్క చేయడం లేదు, వాళ్లకు చేయాలనుకున్న పనులు చేస్తూ ముందుకెళ్తున్నారు. ఈ నిర్ణయం పూర్తిగా వ్యాపార కోణం లో తీసుకున్నదే, ఇందులో భావోద్వేగాలకు చోటు లేదు, ప్రతిపక్షాలు ఈ అంశాన్ని అడ్డు పెట్టుకొని రాజకీయాలు చేయాలనీ అనుకోవడం వాళ్ళ దిగజారుడు తనానికి నిదర్శనం అంటూ మండిపడుతున్నారు కాంగ్రెస్ నేతలు.

# అత్యాచార పాత్రలో నటించడం ఈజీ కాదు

తాప్సీ పన్నూ ప్రధాన పాత్రలో బాలీవుడ్ దర్శకుడు అనుభవ సిన్హా దర్శకత్వంలో తెరకెక్కిన 'అస్సి' చిత్రంలో అత్యాచార బాధితురాలిగా నటించిన మలయాళ నటి కని కుస్రుతి తన పాత్ర గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ఫిబ్రవరి 20న ఈ చిత్రం విడుదల కాబోతుండగా.. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఆమె మాట్లాడుతూ.. తాను ఈ చిత్రంలో 'పరిమ' అనే వివాహిత పాత్రలో నటించబోతున్నట్లు తెలిపింది. అత్యాచారానికి గురైన ఒక మహిళ అనుభవించే మానసిక వేదనను వేరొకరు పూర్తిగా అర్థం చేసుకోవడం అనేది చాలా కష్టమైన విషయం. అలాంటి పాత్రలో తాను నటించడం చాలా సవాలుతో కూడుకున్నది. ఒక నటిగా ఆ వేదనకు సాధ్యమైనంత దగ్గరగా వెళ్లడానికి ప్రయత్నించానని, కొన్ని క్షణాల్లో అది నిజంగా తనకే జరుగుతోందా అనేంతగా లీనమయ్యానని కని తెలిపారు. అయితే ఆ ట్రామాలోకి పూర్తిగా వెళ్లడం వల్ల వ్యక్తిగతంగా తనపై ప్రభావం పడుతుందనే ఉద్దేశంతో కొంత దూరం పాటించానని ఆమె వివరించారు.భారతదేశంలో పెరుగుతున్న ఒక మహిళగా ఇలాంటి దాడులు లేదా వేదనల గురించి అవగాహన ఉండటం తనకు సహజమని తెలిపిన కని.. తన సన్నిహితులు కూడా ఇలాంటి పరిస్థితులను ఎదుర్కోవడం వల్ల ఇది మన చుట్టూ ఉండే చేదు వాస్తవమని కని పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా భారతీయ న్యాయ వ్యవస్థలోని క్లిష్టతలను కూడా తాను అర్థం చేసుకున్నానని, కోర్టు విచారణల సమయంలో బాధితులు పాత గాయాలను మళ్లీ తలుచుకుంటూ ఎంత నరకం అనుభవిస్తారో తనకు అర్థమైందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఢిల్లీలో నివసించే పరిమ అనే మహిళ కిడ్నాప్‌కు గురై, సామూహిక అత్యాచారానికి గురైన తర్వాత ఆమె న్యాయం కోసం చేసే పోరాటం చుట్టూ ఈ చిత్ర కథ తిరుగుతుంది.

# తెలంగాణ నేపథ్యంలో 'క్రేజీ కల్యాణం'



సినిమాల ఎంపికలో అనుపమ పరమేశ్వరన్ తన ప్రాధాన్యతలను మార్చుకుంది. కొత్తదనం కలబోసిన కథల్ని ఎంచుకుంటూ పాత్రలపరంగా ప్రయోగాలకు సిద్ధమంటున్నది. తెలుగులో ఈ భామ నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కల్యాణం'. నరేష్ వీకే, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ఇతర ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు.బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని బూసమ్ జగన్ నిర్మిస్తున్నారు. బుధవారం అనుపమ పరమేశ్వరన్ పుట్టిన రోజు సందర్భంగా కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో పెళ్లి కూతురుగా ముస్తాబై పట్టరాని ఆనందంతో డ్యాన్స్ చేస్తూ కనిపిస్తున్నది అనుపమ పరమేశ్వరన్. పెళ్లి చుట్టూ సాగే ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌లో ఆమె కీర్తి అనే పాత్రలో కనిపిస్తుందని, తెలంగాణలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో చిత్రీకరణ జరిపామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: శ్యామ్ ధూపాటి, సంగీతం: సురేష్ బొబ్బిలి, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు, దర్శకత్వం: బద్రప్ప గాజుల.

# మిరాకిల్ షూట్‌లో ఎంటర్ కానున్న హెబ్బా పటేల్



టాలీవుడ్ హాట్ బ్యూటీ హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న లేటెస్ట్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్ 'మిరాకిల్'. 'సత్య గ్యాంగ్', 'రౌటర్ శివ' వంటి చిత్రాలతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న ప్రభాస్ నిమ్మల ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా, మూడో షెడ్యూల్‌ను ఈనెల 24 నుంచి హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ప్రారంభించనుంది. ఈ షెడ్యూల్‌లో హెబ్బా పటేల్ షూటింగ్‌లో పాల్గొనబోతున్నట్లు చిత్రబృందం తాజాగా ప్రకటించింది. సైదా ఫ్యామిలీ ఎంట్టంల్గ÷న్మెంట్ బ్యానర్‌పై రమేష్ ఎగ్గిడి, శ్రీకాంత్ మొగదాసు, చందర్ గౌడ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రణధీర్ భీసు హీరోగా నటిస్తున్న ఈ సినిమాలో సీనియర్ హీరోలు శ్రీరామ్, సురేష్ కీలక పాత్రలు పోషించడం విశేషం. ఈ చిత్రం ద్వారా నాయుడు పెంద్ర విలన్‌గా పరిచయమవుతున్నారు. గ్లామర్, యాక్షన్ కలగలిసిన ఈ చిత్రంలో సీనియర్ జర్నలిస్ట్ ధీరజ అప్పాజీ ఫోరెన్సిక్ ఆఫీసర్‌గా నటిస్తున్నారు. దర్శకుడు ప్రభాస్ నిమ్మల స్వయంగా కథ, మాటలు, స్క్రీన్ ప్లే అందించడమే కాకుండా సంగీతాన్ని కూడా సమకూర్చడం ఈ సినిమా ప్రత్యేకత.

రవి బస్రూర్ వంటి దిగ్గజాల స్ఫూర్తితో రూపొందుతున్న యాక్షన్ బ్లాక్స్ ఈ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని నిర్మాతలు ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఆమని, ఝాన్సీ, విజయ్ సూర్య వంటి భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ 'మిరాకిల్' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి అద్భుతాలు సృష్టిస్తుందో చూడాలి.

# ఫ్యామిలీపై విమర్శలు చేస్తే ఊరుకునేదే లేదు



గత ఏడాది జరిగిన 'బ్రహ్మానందం' సినిమా ఈవెంట్‌లో మెగాస్టార్ చిరంజీవి చేసిన సరదా వ్యాఖ్యలు అప్పట్లో సోషల్ మీడియాలో పెద్ద వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. ఇంటికి వెళ్తే "లేడీస్ హాస్టల్ వార్డెన్‌లా ఉంటాను" అంటూ కుటుంబంలో మహిళల ప్రాధాన్యత గురించి సరదాగా చెప్పిన ఆ వ్యాఖ్యలను కొందరు తప్పుగా అర్థం చేసుకుని తీవ్ర విమర్శలు చేశారు. ఆ కామెంట్స్ మళ్లీ తాజాగా ట్రెండ్ అయ్యాయి. ముఖ్యంగా రామ్ చరణ్ – ఉపాసన దంపతులకు బాబు పుట్టిన సందర్భంగా ఆ పాత వీడియోలను తీసుకువచ్చి చిరంజీవిని ట్రోల్ చేయడం ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో మెగా కోడలు, వరుణ్ తేజ్ భార్య లావణ్య త్రిపాఠి సోషల్ మీడియాలో గట్టిగా స్పందించారు. కుటుంబానికి సంబంధించిన సంతోషకరమైన క్షణాలను కూడా వివాదాస్పదం చేయడం సరికాదని ఆమె అసహనం వ్యక్తం చేశారు. చిరంజీవి మహిళలను ఎంత గౌరవంగా చూస్తారో తెలియకుండా విమర్శలు చేయడం బాధాకరమని, ఇతరులను విమర్శించే ముందు వారి వ్యక్తిత్వం గురించి తెలుసుకోవాలని ట్వీట్ రూపంలో పేర్కొన్నారు. తాజాగా మరోసారి ఈ అంశంపై స్పందించిన లావణ్య "మా కుటుంబం జోలికి ఎవరైనా వస్తే అస్సలు ఊరుకోను" అంటూ స్పష్టం చేశారు. చిరంజీవి తన కుటుంబంలోని మహిళలను, ముఖ్యంగా మనవరాళ్లను ఎంతో ప్రేమగా చూసుకుంటారని, ఆయన వ్యక్తిత్వం గురించి మాట్లాడే వారు ఆయన చేసిన సేవల్లో ఒక్క శాతం కూడా చేయలేరని ఘాటుగా వ్యాఖ్యానించారు. అంటూ ఆమె చేసిన ఆంగ్ల ట్వీట్ కూడా సోషల్ మీడియాలో విస్తృతంగా వైరల్ అయింది. ఇదిలా ఉండగా పెళ్లి తర్వాత లావణ్య త్రిపాఠి నటిస్తున్న తాజా చిత్రం 'సతీ లీలావతి'పై కూడా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రంలో లావణ్య సరసన దేవ్ మోహన్ హీరోగా నటిస్తుండగా తాతినేని సత్య దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండగా త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. మొత్తంగా కుటుంబ గౌరవం విషయంలో లావణ్య త్రిపాఠి తీసుకున్న స్టాండ్ మెగా అభిమానులను ఆకట్టుకుంటుండగా సోషల్ మీడియాలో ఈ అంశం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com